RNI NO. TELTEL/2022/83470
●manasakshi.in
# మనసాక్షి
మీకోసం
తెలుగు దినపత్రిక
ఎడిటర్: మల్లె నాగిరెడ్డి

## బ్యారేజీల పునరుద్ధరణలో మాట రానివ్వొద్దు



**దిల్లీ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షక సంస్థ (ఎన్డీఎస్ఏ) మార్గదర్శకాల మేరకే చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. దిల్లీలో ఆయన గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి అధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల అంశంపై సమీక్ష నిర్వహించారు. బ్యారేజీల వద్ద పరీక్షలు, బోర్ల తవ్వకాలు, పనుల్లో వేగం పెంచే చర్యలు ఎంతవరకు వచ్చాయంటూ బ్యారేజీల పునరుద్ధరణ పనుల కోసం ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీ కన్వీనర్, కర్నల్ పరీక్షిత్ మెహ్రాను సీఎం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద బోర్ల తవ్వకాలు ఈ నెలాఖరులోగా పుంజుకుంటాయని పరీక్షిత్ వివరించినట్లు సమాచారం. దీంతో బ్యారేజీల పునరుద్ధరణలో వేగం పెంచాలని సీఎం సూచించారు. ఈ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందున తాత్కాలిక పనులు చేయడం, వెయ్యి బోర్లు వేయాల్సిన చోట అరకొరగా వేసి వదిలేయడం వంటివి చేయవద్దని సీఎం అప్రమత్తం చేశారు. ప్రభుత్వానికి మాట రానివ్వద్దని సూచించారు.

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 4. సంచిక :210 | శుక్రవారం 17 ఏప్రిల్ 2026 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in

# లోక్‌సభ సీట్లు 816

## తెలంగాణలో 26.. ఏపీలో 38..

తెలంగాణలో 17 నుంచి 26కు ఎంపిల సంఖ్య

ఎపిలో 25 నుంచి 38కి పెరుగుదల

డీలిమిటేషన్‌పై హోంమంత్రి అమిత్ షా వెల్లడి

దక్షిణాదికి అన్యాయం జరగదని వివరణ



**న్యూఢిల్లీ:** డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారంగా తిప్పికొట్టారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. జనాభా గణన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదన్నారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు.

పెరిగేవన్నీ మహిళలకే.. మహిళలకు 33% రిజర్వేషన్లను అమలు చేయడం కోసం దేశవ్యాప్తంగా 50% సీట్లు పెంచుతున్నామని, అలా పెరిగే సీట్లన్నీ మహిళలకే వెళ్తాయని అమిత్ షా తెలిపారు. మిగిలిన 543 సీట్లు ఓపెన్‌గా ఉంటాయని, అందులోనూ మహిళలు పోటీ చేయొచ్చని చెప్పారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు బిల్లుల కారణంగా లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందని, చాలా నష్టం జరుగుతుందన్న భ్రమను కలిగించేందుకు కొందరు విస్తృతంగా ప్రయత్నిస్తున్నారని, కానీ అందులో ఏమాత్రం నిజం లేదని అమిత్ షా స్పష్టం చేశారు.

# మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత



ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు

మండిపడ్డ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్:పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ –పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టు కుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు.



## తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే

దీనిపై బిజెపి ఎంపిలు నోరు మెదపరా

జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు

హైదరాబాద్: తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా– పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి పోరాటాన్ని అంతలా కించపరుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు

## దేశవ్యాప్తంగా మండుటెండలు

అప్రమత్తంగా ఉండాలన్న ఐఎండి

'ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పులు తీవ్రతరం అవుతున్నాయి. వడదెబ్బల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగండి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కష్టమైన పనులు చేయకండి.



2లో..

## తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే

బేషరతుగా ఆయన క్షమాపణలు చెప్పాలి

మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్

గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదేబాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని హరీష్‌రావు ధ్వజమెత్తారు.



2లో..



## మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

ఇందులో ఎలాంటి రాజకీయం లేదు

30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు

వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత

చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం

ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు

ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తేవద్దు డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

2లో..

## లోక్‌సభ సీట్లు పెంచడంపైనే మీ దృష్టి

మహిళా రిజర్వేషన్లను ఎవ్వరూ వ్యతిరేకించడం లేదు

పక్కా ప్లాన్ ప్రకారమే సమావేశాలు

చాణుక్యుడు బతికుంటే మీ కుయుక్తికి ఆశ్చర్య పోయేవాడు

లోక్‌సభలో ప్రియాంక సెటైర్లు...అమిత్‌షా నవ్వులు

మహిళా రిజర్వేషన్ బిల్లను ఎవరూ వ్యతిరేకించలేదు. రాహుల్ స్వయంగా మోదీ దగ్గరకు వెళ్లి మరీ మద్దతు తెలిపారు.



2లో..

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

స్పీకరస్ సహా 9మంది వివరణ కోరిన హైకోర్టు

విచారణ మే 6కు వాయిదా

గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఈ ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, వారు ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారనే అర్థం వచ్చేలా స్పీకర్ తీర్పునిచ్చారు. అయితే, వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు.



2లో..



2లో..

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

● ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి

● ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్

● అమెరికా పెట్టుబడిదారులకు తెలయి చేయండి

● అమెరికన్ నేషనల్ వార్ కాలేజీఇ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు

# దేశవ్యాప్తంగా మండుటెండలు

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమండుతున్నాడు. మధ్యాహ్నం బయట తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వడగాల్పుల కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వడదెబ్బలు తగిలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పులు తీవ్రతరం అవుతున్నాయి. వడదెబ్బల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగండి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కష్టమైన పనులు చేయకండి. లైట్ కలర్ దుస్తులు ధరించండి. తరచుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. వడదెబ్బ తగిలితే .. వెంటనే ఆ వ్యక్తిని చల్లని ప్రదేశానికి తరలించండి. నేలపై పడుకోబెట్టండి. నీళ్లలో తడిపిన బట్టను కప్పండి. చల్లని నీళ్లు తాగించండి. నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారాపదార్థాలను అతడికి తినిపించండి' అని సూచించింది. ఏప్రిల్ 20వ తేదీ వరకు తెలంగాణ, రాయలసీమ, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, ఉత్తర కర్ణాటక, మధ్య ప్రదేశ్, విదర్భ, ఒడిశా, జార్ఖండ్, వెస్ట్ రాజస్థాన్‌లలో అత్యంత తీవ్రంగా వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో వేడి, పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది.

# మహిళా రిజర్వేషన్లు మహిళల హక్కు

న్యూఢిల్లీ :మహిళా రిజర్వేషన్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని రాజమండ్రి లోక్‌సభ ఎంపీ పురందేశ్వరి అన్నారు. గతంలో చాలాసార్లు బిల్లు పెట్టినా సాకారం కాలేదని, అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ మద్దతివ్వలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఆమె మాట్లాడారు. రాజకీయాల్లో మహిళల పాత్ర పెరిగిందని గ్రహించాలన్నారు. ఈ బిల్లు పాస్ కావడం మహిళల దశాబ్దాల కల. 2023లో మద్దతిచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాత్రం కొర్రీలు పెడుతోంది. జనగణన పేరుతో అభ్యంతరాలు చెబుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు మొట్టమొదట 1996లో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ మాత్రం ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టిందని అన్నారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన 131వ రాజ్యాంగ సవరణ బిల్లులపై జరిగిన చర్చలో పలు విషయాలు వెల్లడించారు. ఈ చారిత్రక బిల్లులకు పూర్తి మద్దతు ప్రకటించిన ఆమె, మహిళా రిజర్వేషన్ల అమలులో గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. ప్రసంగం ప్రారంభంలో ఆమె తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహిళా సాధికారత కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే ఆస్తిలో కుమార్తెలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు, మహిళా విశ్వవిద్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటు వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన తీసుకున్నారని సభకు వివరించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్లను కోల్పోతాయన్న ఆందోళనలపై ఆమె స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం, లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచడం వల్ల ఏ రాష్ట్రానికి ఉన్న ప్రస్తుత సీట్లు తగ్గవని భరోసా ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సీట్ల పెంపు ఉండటం వల్ల రాజకీయ సమతుల్యత దెబ్బతినదని, దక్షిణాది రాష్ట్రాల గొంతు పార్లమెంట్‌లో బలంగానే ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం గతంలో తీవ్ర జాప్యం చేసిందని పురందేశ్వరి విమర్శించారు. 1996 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లును 2010లో రాజ్యసభ ఆమోదించినా, లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్‌కు మనసు రాలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ప్రధాని మోదీ ఈ బిల్లును యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తుంటే, విపక్షాలు అనవసరపు రాజకీయ కారణాలతో అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు వల్ల దేశాభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములుగా మాత్రమే కాకుండా, నిర్ణేతలుగా మారతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఈ బిల్లు మహిళలకు రాజకీయ న్యాయం చేకూరుస్తుందని పేర్కొన్నారు. పునర్విభజన ప్రక్రియలో ప్రతి రాష్ట్రం గొంతు వినబడుతుందని, పబ్లిక్ హియరింగ్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ చారిత్రక ఘట్టంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని చెబుతూ ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం



న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు.మహిళా రిజర్వేషన్ ప్రక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు.

ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి



హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమయ్యారు.యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం.

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా,తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతాం' అని స్టేట్ డిపార్ట్ మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ సీట్లు పెంచడంపైనే మీ దృష్టి



న్యూఢిల్లీ: కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ...చాణుక్యుడు కూడా ఇంత పక్కాగా ప్లాన్ చేసి ఉండలేదని అన్నారు. మహిళా కోటా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, అయితే దీనిని అమలు చేయడానికి డీలిమిటేషన్ చేస్తుండటంపైనే తమ అభ్యంతరాలు ఉన్నాయని లోక్‌సభలో ఆమె అన్నారు. ఎన్నికల్లో పైచేయి సాధించడానికి ఇది ఒక రాజకీయ అస్త్రం అని ఆమె ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని దెబ్బతీయడానికి బీజేపీ తన పార్టీ పునాదులను బలోపేతం చేసుకుంటోందని ఆమె అన్నారు. ఇదిలా ఉంటే, చాణక్యుడిని ప్రస్తావిస్తూ ఆమె వేసిన సెటైర్లు సభలో నవ్వులు పూయించాయి. కేంద్రం హోం మంత్రి అమిత్ షా కూడా ప్రియాంకా వ్యాఖ్యలకు నవ్వారు. మీరంతా పక్కా ప్లాన్‌తో వచ్చారు. ఈ రోజు గనుక చాణక్యుడు బతికి ఉంటే మీ కుయుక్తికి ఆయన ఆశ్చర్యపోయి ఉండేవారని ఆమె అన్నారు. రాష్ట్ర ఎన్నికల సమయంలో హఠాత్తుగా పార్లమెంట్ ఏర్పాటు చేయడం, ఎన్నికలకు ఒక రోజు ముందే ముసాయిదా ముందుకు తేవడం, మహిళా అభ్యున్నతి కోసం మోడీ అతిపెద్ద నిర్ణయం తీసుకున్నారని మీడియాలో చర్చ జరిపించడం, ప్రతీ ఒక్కరూ ఆయనకు మద్దతు ఇచ్చేలా చేయడం, ఇలా ప్రతిపక్షాలను సందిగ్ధంలో పడేయడం అంతా ప్లాన్ అంటూ ఆమె ఆరోపించారు. ఈ వ్యాఖ్యలుకే అమిత్ షాతో పాటు మంత్రులు కిరెన్ రిజిజు నవ్వారు. అంతకముందు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని తప్పుపట్టిన ఆమె.. అందులో జవహర్‌లాల్ నెహ్రూ పేరు వినిపించకపోవడం గమనార్హం అని అన్నారు. మహిళల హక్కుల పట్ల బీజేపీ నేతలే ఛాంపియన్లుగా భావిస్తున్నారని ఆమె విమర్శించారు. మోదీ ప్రసంగంలో నెహ్రూ పేరు వినిపించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. రిజర్వేషన్లపై 2018లోనే ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ లేఖ రాశారు. 2019లోపే రిజర్వేషన్లు అమలు చేయాలని రాహుల్ కోరారు. ప్రధాని మోదీ సగం సమాచారం మాత్రమే వెల్లడించారు. ఇవాళ ప్రధానంగా రిజర్వేషన్ల కోటాపై చర్చ కాదు.. లోక్‌సభ సీట్లను 850కి పెంచడంపైనే. మోదీ ప్రభుత్వం లోక్‌సభ సీట్ల పెంపుపైనే ఆసక్తి కనబరుస్తోంది. ఆ విషయంలో ప్రభుత్వానికి అంత తొందరెందుకని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లను ఎవరూ వ్యతిరేకించలేదు. రాహుల్ స్వయంగా మోదీ దగ్గరకు వెళ్లి మరీ మద్దతు తెలిపారు. ఆ బిల్లుపై క్రెడిట్‌ను మోదీ.. కాంగ్రెస్‌కు ఇవ్వలేదు. దేశ మహిళలకు కాంగ్రెస్ ఎంతో సేవ చేసింది. బిల్లు విషయంలో మహిళలను బీజేపీ తప్పుదోవ పట్టిస్తోంది. మహిళా బిల్లును ఎవరు వ్యతిరేకిస్తున్నారో మోదీ చెప్పాలి. కులగణనకు మోదీ ఎందుకు భయపడుతున్నారు? ఓబీసీలకు న్యాయం జరగాలి.. వారి హక్కులను ఎవరూ కాలరాయలేరు' అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.


# బిసిలకు పెద్దపీట వేసిన జగన్

అమరావతి: బిసిల సాధికారతకు వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన బిసి సెల్ సమావేశంలో సజ్జల మాట్లాడారు. జగన్ బిసిల కోసం విధాన పరమైన నిర్ణయాలు తీసుకున్నారని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. సమాజంలో వెనుక బడిన తరగతుల జీవితాల్లో వెలుగులు నింపాలనే తాపత్రయంతో పనిచేశారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అవినీతి వ్యవస్థీకృతంగా మారింద న్నారు. ప్రతిచోటా రాజకీయ జోక్యం ఉంటోందని, రాజధాని పేరుతో మోయలేనంత భారం, వ్యతిరేకించిన వారంతా దేశద్రోహులు అనే ముద్ర వేస్తున్నారని తెలిపారు. అమరావతి భారం రాష్ట్రమ ంతా భరించాలంటున్నారని, జనాన్ని మభ్యపెట్టి మాటలతో కోటలు కడుతున్నారని అన్నారు. కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చారని తెలిపారు. హైరైజ్ పేరుతో 40 అంతస్తులు, 50 అంతస్తులు కట్టాలనుకోవడం మోయలేని భారమని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరిని అందులో భాగంగానే అరెస్టు చేశారని అన్నారు. నరసరావుపేటలో టిడిపి ఎమ్మెల్యే.. ఎస్పి ఆఫీసులోనే హడావుడి చేస్తే కనీసం కేసు కూడా లేదని అన్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ.. జగన్ కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా వెనుకడుగు వేయబోమని అన్నారు. యాదవ సామాజికవర్గం నుండి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఐదో వ్యక్తినని తెలిపారు. మాజీ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ఏలూరులో జరిగిన బిసి గర్జనతో వైసిపి 151 సీట్లు వచ్చాయని, జగన్‌కు బిసిలు ఎప్పుడూ తోడుగా ఉండాలని అన్నారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో జగన్ విద్యారంగంలో సమూల మార్పులు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా అనంతపురంలో ఈ నెల 26న నిర్వహించే బిసి గళం సమావేశ పోస్టరును ఆవిష్కరించారు.

## తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే

హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే గనుక సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చిపారేసేవారని హరీష్‌రావు అన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు.. ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్-పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదేబాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని హరీష్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి, ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడిచేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నడూ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్



హైదరాబాద్:తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన 9 మంది ఎమ్మెల్యేల తో పాటు, స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జాబితాలో ఉన్న ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి (సంజయ్), తెల్లం వెంకట్రావు ఉన్నారు. గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఈ ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, వారు ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారనే అర్థం వచ్చేలా స్పీకర్ తీర్పునిచ్చారు. అయితే, వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందన్నది వారి ప్రధాన వాదన. ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన హైకోర్టు, తదుపరి విచారణను మే 6వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులందరూ తమ కౌంటర్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఈ కేసులో హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ కలిగిస్తోంది. ఒకవేళ కోర్టు అనర్హత వేటు విషయంలో కఠినంగా వ్యవహరిస్తే, రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంటుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా ఉంది.

# ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు చేరవేయడమే లక్ష్యం

## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**కొల్చారం, ఏప్రిల్ 16,మన సాక్షి:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెదక్ జిల్లా కొల్చారం మండలం లో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి, నిర్ణీత కాలంలో పరిష్కారం చూపించాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం మండల సమాఖ్య సభ్యురాలు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ అభివృద్ధిలో సంఘాల పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసాచారి ప్రత్యేక అధికారి జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, ఎంపీడీవో,
రఫీక్ ఉన్నిసా బేగం, ఎస్ ఐ మొయినిద్దిన్ కొల్చారం సర్పంచ్ దేవన్నగారి శేఖర్,
అప్పాజీ పల్లి సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్,మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి, ఏఈఓ లు నిరోషా, శ్రవంతి పంచాయతీ కార్యదర్శులు రాజు, ప్రశాంత్, మహేష్,మమత,వైద్య అధికారి రమేష్ నాయక్ వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో చలివేంద్రాలు ప్రారంభం

**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**



నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో, సత్యనారాయణ సేవ సమితి సహకారంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా బాటసారుల దాహం తీర్చేందుకు కార్యక్రమాన్ని చేపట్టారు.?సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో రక్తదానం ఎంత ముఖ్యమో, వేసవి కాలంలో నీటి దానం కూడా అంతే ముఖ్యం అని పేర్కొన్నారు. ప్రధానంగా రోడ్లపై తిరిగే సామాన్యులు, చిన్న వ్యాపారస్తులు, రాపిడో,స్విగ్గీ డెలివరీ బాయ్స్ వంటి రోజువారీ కార్మికులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నదే తమ ప్రధమ లక్ష్యమని ఆయన వెల్లడించారు.?ఈ సేవా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అజామ్, మహేందర్, ఇమ్రాన్, సాయి, వినయ్, రోహిత్, నాగరాజు, లావణ్య, విజయ్, ఆకాష్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# హ్యూమన్ వ్యాల్యూస్ నోడల్ సెంటర్‌గా మిట్స్

**మదనపల్లి, ఏప్రిల్ 16,మన సాక్షి:**



మదనపల్లె సమీపంలో గల మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ మరో ప్రతిష్టాత్మక గౌరవాన్ని సొంతం చేసుకుంది. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి న్యూ ఢిల్లీ వారు 2025--27 సంవత్సరాల కాలానికి "యూనివర్సల్ హ్యూమన్ వ్యాల్యూస్ (సార్వత్రిక మానవ విలువలు)" కార్యక్రమం అమలుకు మిట్స్‌ను నోడల్ సెంటర్‌గా గుర్తించినట్లు వీసీ యువరాజ్ తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, విలువల ఆధారిత విద్యా విధానం, సమాజ సేవా దృక్పథం పెంపొందించడం వంటి అంశాల్లో మిట్స్ యూనివర్సిటీ చూపుతున్న నిరంతర కృషిని గుర్తించి ఈ గౌరవ గుర్తింపు ధ్రువపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. సార్వత్రిక మానవ విలువలను విద్యా వ్యవస్థలో సమన్వయం చేయడం, ఇతర విద్యాసంస్థలకు కూడా ఈ విలువలను విస్తరించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, సామాజిక బాధ్యతల పట్ల విద్యార్థులు, అధ్యాపకులను ప్రోత్సహించడం వంటి అంశాలు ఈ గుర్తింపుకు ప్రధాన కారణమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా మిట్స్ యూనివర్సిటీ ఫౌండర్ ఢ ఛాన్సలర్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ యెన్. ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ యూహెచ్‌వీ సెల్ సభ్యులు అధ్యాపకులను అభినందించారు.
విలువలతో కూడిన విద్యను ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మిట్స్ యూనివర్సిటీకి మరో మైలురాయిగా నిలిచింది.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి

**కంగ్టి, ఏప్రిల్ 16,మన సాక్షి :**



ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందేలా అధికారులు చొరవ చూపాలని మండల ప్రత్యేక అధికారి ఏడిఏ నూతన్ కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రమైన కంగ్టిలోని బసవ ప్రదీప్ ఫంక్షన్ హాల్ లో మండల అధికారులు, సర్పంచులతో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... ముఖ్యంగా విద్యుత్, తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు.

**ఈజీఎస్ పనులు అమలు పరచాల్సిన బాధ్యత జీపీదే:**

గ్రామాల్లో ఈజీఎస్ ఉపాధి పనులను సక్రమంగా అమలు పరచాల్సిన బాధ్యత సెక్రటరీతో పాటు సర్పంచ్, ఉప సర్పంచ్లకు ఉందని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పై కంగ్టి లో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందిస్తున్న ఉపాధి పనులను పేద ప్రజలకు కల్పించాలని చెప్పారు. మండలంలో 4993 చేయుత పింఛన్లు ప్రతినెల అందిస్తున్నట్లు చెప్పారు. పింఛనుదారు మరణిస్తే, అదే పింఛన్ వారి కుటుంబంలో ఓఏపీ అందిస్తామన్నారు.

**భార్యలకు బదులు భర్తలు హాజరు:**

గురువారం కంగ్టి లో జరిగిన మండల స్థాయి ప్రాజపాలన– ప్రగతి ప్రణాళిక సమావేశానికి సర్పంచులుగా ఎన్నికైన మహిళలకు బదులు వారి భర్తలు హాజరైయ్యారు. మండల స్థాయిలో 16 మంది మహిళలు సర్పంచులుగా గెలిచారు. అయితే కార్యక్రమానికి కేవలం ముగ్గురు, నలుగురు మహిళా సర్పంచులు మాత్రమే రావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగ భవాని,ఎంఈవో ఎండి రహీమొద్దీన్,డిఎల్పిఓ సంజీవ రావు, ఎంపివో లక్ష్మణ్, ఏవో హరీష్ పవర్, ఏపీఓ బస్వరాజ్, ఏపీఎం శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ శోభారాణి, పశువైద్యాధికారి సయ్యద్ ముస్తక్, వైద్యాధికారి డాక్టర్ నాగమణి, వివిధ శాఖ అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు , తదితరులు పాల్గొన్నారు.

# కొరపాక అంజి మాదిగకు దళిత రత్న పురస్కారం

**నాచారం,ఏప్రిల్ 16,మన సాక్షి:**



డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మహనీయుల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత రత్న పురస్కారాల కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ కొరపాక అంజి మాదిగ దళిత రత్న పురస్కారం అందుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తూ ఉద్యమంలో కట్టుబడి పనిచేస్తూ, సామాజిక సేవలో ముందుండి సేవలందిస్తున్నందుకు ఈ పురస్కారం లభించినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు కృషి చేయడంతో పాటు తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తన ప్రయాణాన్ని గుర్తించి, మహనీయుల జయంతులు, వర్ధంతుల సందర్భంగా అన్ని విధాల సహకరిస్తూ దళిత బహుజన పేద వర్గాల కుటుంబాలకు అండగా నిలిచినందుకు ఈ గౌరవం దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దళిత రత్న పురస్కారాన్ని అందజేసిన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్.వై. అశోక్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సమాజ సేవలో మరింతగా కృషి చేస్తానని కొరపాక అంజి మాదిగ పేర్కొన్నారు.

# వేలం పాట ద్వారా రూ.3,56,998 ఆదాయం

**రామసముద్రం,ఏప్రిల్ 16,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని మేజర్ పంచాయతీ చెంబకూరు పలు వనరులు వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండ్ గేటుకు నిర్వహించిన వేలం పాట ద్వారా రూ. 3,56,998ఆదాయం వచ్చినట్లు డిప్యూటీ ఎంపిడిఓ కృష్ణవేణి, తెలిపారు. గురువారం చెంబకూరు పంచాయతీ కార్యాలయం వద్ద డిప్యూటీ ఎంపిడిఓ కృష్ణవేణి పంచాయతీ సెక్రటరీ రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో ముగ్గురు పాల్గొనగా సంవత్సర కాలంపాటు వసూలు చేసుకొనే హక్కును దిన్నిమీద హరిజన వాడకు చెందిన గొర్రెల శంకర్ రూ 3,56,998హెచ్చుగా పాడి సంత, బస్టాండ్ గేటు, దినసరి మార్కెట్ లను దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో డిప్యూటీ ఎంపిడిఓ కృష్ణవేణి, పంచాయతీ సెక్రటరీ రెడ్డిశేఖర్, కూటమి నాయకులు రామ్మూర్తి రంగాని వెంకటేష్, మహ్మద్ ఇలియాజ్,కైకాల బాబు స్థానికులు చంద్రశేఖర్ ( ఆజాద్ ) ఫ్రూట్స్ ఉస్మాన్,వేలం పాటధారులు పాల్గొన్నారు.

# 26 ఏళ్ళ తర్వాత మురిసిన స్నేహం..!



**కొడంగల్,ఏప్రిల్ 16,మన సాక్షి:**

కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం పరిధిలో గల చల్లాపూర్ గ్రామంలో ఉన్నటువంటి ప్రాథమిక ఉన్నత పాఠశాల లో 1999 – 2000 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులకు పూలమాలవేసి, శాలువాతో , సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ, చిన్ననాటి స్నేహాలు చిగురించాయి. పాత జ్ఞాపకాలు పలకరించాయి. సుమారు 26 ఏళ్ల సుదీర్ఘ వీరమానం తర్వాత ఒకే వేదికపై కలిసిన ఆ స్నేహితుల కళ్ళలో ఆనందం వెల్లి వెలిసింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఇప్పటికి మరువలేము అని అన్నారు. ఉపాధ్యాయులలో ఒకరు శామప్ప స్వర్గస్తులయ్యారు వారి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి తెలిపారు. తమ విద్యార్థులు ప్రయోజకులుగా మరి తమకు గౌరవించడం పట్ల గురువులు హర్ష వ్యక్తం చేస్తూ వారికి ఆశీర్వదించారు. దాదాపు 26 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరికొకరు అపయంగా పలకరించుకున్నారు. అదేవిధంగా తమ కుటుంబ విషయాలను వృత్తిపరమైన విశేషాలను పంచుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వయస్సును మరిచి ఆటపాటలతో ఆనంద ఉత్సవాల మధ్య రోజంతా గడిపారు. ఈ కార్యక్రమంలో. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి, గోపాల్ నాయక్, రాములు నాయక్, కిష్టయ్య, అనంతప్ప, మల్లేశం, సాయప్ప, కృష్ణయ్య, పూర్వ విద్యార్థుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# మంజూరైన నిధులను తక్షణమే విడుదల చేయాలి

**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 16, మన సాక్షి:**



త్రాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి జలమండలి ఎండీతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమావేశం. మల్కాజ్‌గిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో నెలకొన్న త్రాగునీటి కొరత,డ్రైనేజీ సమస్యలను వినతిపత్రం అందజేసి వివరంగా తెలియజేశారు. ముఖ్యంగా మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని హెడ్ కాలనీల ట్రంక్ మైన్ పనులకు ఇప్పటికే మంజూరైన నిధులను తక్షణమే విడుదల చేసి పనులు వేగవంతం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి సమస్యలను సానుకూలంగా పరిగణిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, పవన్, తిరుపతి రావు, నర్సింగ్ రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**వెల్దండ,ఎప్రిల్ 16,మన సాక్షి:**



వెల్దండ మండల కేంద్రంలో గురువారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశమును వెల్దండ గ్రామ రైతు వేదిక యందు ఎంపీడీవో కృష్ణయ్య అద్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, రాబోయే రోజుల్లో అమలు చేయబోయే క్రొత్త పథకాల గురించి సభయందు చదివి వినిపించడం జరిగింది. ఈ సమావేశానికి అధికారులు, సర్పంచులు, వార్డు సభ్యుల హాజరు నమోదు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయశ్రీ, మండల ప్రత్యేక అధికారి , తహసీల్దార్ కార్తీక్ కుమార్, అందరు సర్పంచులు, ఉపసర్పంచ్ లు, వార్డు సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

# భారీగా పలికిన కొబ్బరికాయ వేలం ధర..!

**మేడ్చల్ మల్కాజిగిరి,ఏప్రిల్ 16, మన సాక్షి:**



భారీగా పలికిన కొబ్బరికాయ వేలం ధర. ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కె వెంకన్న, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి సమక్షంలో కొబ్బరి కాయ, పూజ ద్రవ్యాలు అమ్ముకొనుటకు గురువారం వేలం పాటను నిర్వహించారు. ఒక సంవత్సర కాలం పరిమితి గల వేలం పాటలో పాల్గొన్న పాటదారులలో అత్యధిక వేలం పాటను యాదమ్మ 3,80,000/( అక్షరా మూడు లక్షల ఎనభై వేలుకు) కొబ్బరికాయలు, పూజా సామాగ్రి అమ్ముకోనుటకు వేలం పాటను కైవసం చేసుకున్నారు. 2026 మే 15 నుంచి వచ్చే సంవత్సరం 2027 మే 16 వరకు పాట అమలులో ఉంటుంది. పాట సమయంలో సూచించిన నిబంధనలకు లోబడి అమ్ముకోవాలని ఆలయ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ముదుంబై వెంకట రమణా చార్యులు, అర్చకులు డా తులసి వెంకట రమణా చార్యులు, క్లార్క్ సంద్ర సుధాకర్, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు సానాది శంకర్, హేమంత్ కుమార్, పి గణేష్(కన్నా), సంజీవ్, రవీంద్రారెడ్డి, అనిత, పద్మావతి, సురేష్ సింగ్, భక్తులు కామేష్ రావు, లక్ష్మణ్, పద్మావతి, వెంకటా చారి, ఏం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు, డ్రైవర్లకు అవగాహన



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్.సి.పురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చందానగర్ కార్నర్‌స్టోన్ స్కూల్‌లో భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులు, 65 మంది స్కూల్ బస్సు డ్రైవర్లు,30 మంది ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.?ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక శిక్షణ ?ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ సైబరాబాద్ సమన్వయంతో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న వారందరికీ ట్రాఫిక్ నిబంధనల పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ముఖ్యంగా ?ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, కార్లు నడిపే వారికి సీటు బెల్ట్ ప్రాముఖ్యతను వివరించారు.?పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటే పద్ధతులను నేర్పించారు. ?పాఠశాల బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పాటించాల్సిన భద్రతా నియమాలపై డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ఉత్సాహంగా స్పందిస్తూ.. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ పెట్టుకోవడం వంటి ప్రాథమిక నియమాలను పాటించాలని కోరుతూ తమ తల్లిదండ్రులకు ఉత్తరాలు రాస్తామని ప్రతిజ్ఞ చేశారు.?ఈ కార్యక్రమంలో మియాపూర్ ట్రాఫిక్ విభాగం ఏసీపీ ఆదిమూర్తి ఆర్.సి.పురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆర్. విద్యాసాగర్ రెడ్డి , చందానగర్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ విజయ్, పాఠశాల యాజమాన్యం సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడలతో ఆరోగ్యం..మానసిక ఉల్లాసం

**నారాయణపేట టౌన్,ఏప్రిల్ 16, మన సాక్షి :**



క్రీడలతో మనిషి ఆరోగ్య దృఢత్వం, మానసిక ఉల్లాసం పొందుతాడని నారాయణపేట రూరల్ ఎస్సై సతీష్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు.ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యం కలిగి ఉండాలని సూచించారు. ఆటలు మనిషి బుద్ధిని పెంచుతాయన్నారు. గురువా రం నారాయణపేట మండ లంలోని కోటకొండలో పగడాకుల తిరుపతమ్మ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. "కోటకొండ ప్రీమియర్ లీగ్" సీజన్ వన్ అనే పేరుతో కమిటీ కుర్రాళ్ళు యువజన సంఘం నాయకులు టోర్నమెంట్ ను ఆర్గనైజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పరీక్షల సమయంలో మానసికంగా అలసిపోయిన విద్యార్థులు ఇలాంటి ఆటల పోటీల ద్వారా సేద తీరుతారన్నారు.బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలు వీడి శారీ రక శ్రమ చేయాలన్నారు. డ్రగ్స్ కు బానిసలైన యువ కులు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు పగుడాకుల బాలస్వామి మాట్లాడుతూ క్రీడా నిర్వాహ కులను అభినందించారు. తమ తల్లి తిరుపతమ్మ జ్ఞాపకార్థం కోటకొండ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నందుకు కమిటీ కుర్రాళ్లకు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ యువత కోసం తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. సర్పంచ్ వెంకట రాములు గౌడ్, ఉప సర్పంచ్ చన్నప్ప యాదవ్ మాట్లాడు తూ క్రీడాకారులకు శుభాకాం క్షలు తెలియజేశారు. అనంతరం జాతీయ గీతం పాడి, పూజా కార్యక్రమం నిర్వహించి క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించారు. క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు ఎస్సై, సర్పంచ్ , నాయకులు బ్యాటింగ్ ఆడి బౌలింగ్ చేసి అలరించారు. అభంగాపూర్, తిరుమలపూర్, బొమ్మను పాడు నుంచి క్రీడాకారులు భారీగా తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వా హకులు బొల్లు రాజేష్,మూగి రవి , అంజి , బబ్లు ,వెంకటేష్, రాజు, నవ యువత నాయ కులు పగుడాకుల రవి,కోస్గి బాలప్ప,ఎంగలి నవీన్, ఎంగలి సురేందర్, చుక్క రాజు, చర్లపల్లి అంజి ,ఎడ్ల కురుమయ్య, దుబాయ్ రమేష్, పేట చంద్రప్ప, గుండెగారి లక్ష్మయ్య, వేపూరు కాంతు రెడ్డి, బోడెం బాలు, రాము నాయక్ ,చుక్కఆశప్ప ,బొల్లు నరసింహులు, మంగలి యాదయ్య, చుక్క జనార్ధన్, వరుణ్ నాయక్, పగుడాకుల కుర్మయ్య,నక్క విజయ్, మంగలి సత్తి, బిజెపి, బిఆర్ఎస్ వార్డు సభ్యులు గాజుల భగవాన్ శంకర్, కమ్మరి మహేష్ , బాలస్వామి, కోసిగి లక్ష్మప్ప ,దాసరి రాములు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# బాధితులకు భరోసా కేంద్రాలు కొండంత అండ..!

## నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని ఆదేశం

## కరీంనగర్ భరోసా కేంద్రం తనిఖీ

**కరీంనగర్, ఏప్రిల్ 16,మన సాక్షి :**



లైంగిక వేధింపులకు గురైన మహిళలు,చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో చేయూతను అందించి, వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు 'భరోసా' కేంద్రాలు కొండంత అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర అడిషనల్ డీజీపీ (సీఐడీ అండ్ ఏసీబీ) చారు సిన్హా పేర్కొన్నారు. గురువారం నాడు కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపల్లిలో ఉన్న 'భరోసా' కేంద్రాన్ని ఆమె సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలను తనిఖీ చేశారు. ?కేంద్రంలోని ప్రతి విభాగాన్ని సందర్శించిన అడిషనల్ డీజీపీ, సిబ్బందితో మాట్లాడి పనితీరును సమీక్షించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బాధితులకు తక్షణ న్యాయ సహాయం,కౌన్సిలింగ్ అందించడంలో ఏమాత్రం జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ పోలీసు శాఖలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు మంచి సత్ఫలితాలను ఇస్తున్నాయి. లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా పక్కాగా ఆధారాలను సేకరించాలన్నారు. బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సిన నష్టపరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2024 డిసెంబర్లో ప్రారంభమైన ఈ కేంద్రం, బాధితులకు పోలీస్ స్టేషన్లు మరియు ఆసుపత్రులకు తిరిగే ఇబ్బంది లేకుండా ఒకే చోట అన్ని సేవలు అందించడం అభినందనీయమన్నారు. తనిఖీ అనంతరం భరోసా కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటస్వామి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ పుల్లయ్య, ఎస్సై అనూష,భరోసా కేంద్రం సిబ్బంది ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని నిల్వ చేసుకోవడం కోసం ప్రభుత్వం గిడ్డంగులు ఏర్పాటు

**శివంపేట,ఏప్రిల్ 16,మన సాక్షి:**

రైతులు పండించిన పంట నిల్వ చేసుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం గిడ్డంగులను మెదక్ జిల్లా కోపరేటివ్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం డైరెక్టర్ శ్యాం కుమార్ అన్నారు శివంపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు శివంపేట మండల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులు పండించిన వరి ధాన్యం నిలువ చేసుకోవడం ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి రాజు కిరణ్. శివపేట్ మండల సహకార సంఘం సీఈవో మధు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో విజయభేరి..!

**వెల్దండ,ఏప్రిల్ 16,మన సాక్షి:**




వెల్దండ మండలం గుండాల గ్రామంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 10 తరగతి సీబీఎస్ఈ 2026 పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు సి. అక్షిత 477/500 మార్కులు 95.4 పర్సంటేజ్ తో, వి. రుచిత 474/500 మార్కులు 94.80 పర్సంటేజ్ తో విజయం సాధించారని, అలాగే తమ ఇద్దరు విద్యార్థులు తెలంగాణలోని అన్ని (23) ఏకలవ్య స్కూల్ లలో ప్రథమ ర్యాంక్(477 ),మూడవ ర్యాంక్ (474) సాధించినట్లు ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 56 మంది విద్యార్థులకు గాను , 56 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి సీబీఎస్ఈ పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.విద్యార్థులను అభినందించిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ కోడం భాస్కర్ , ఉపాధ్యాయులు రీనా, అనిల్, రాహుల్, అనీషా, కీర్తి, పర్వీన్, రాం ప్రసాద్, వేద పాల్, అవనీష్ , రీవూ,ప్రవీణ్, ప్రక్కర్ జైన్ విద్యార్థులు పాల్గొన్నారు .

## కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16, మన సాక్షి :**

ఇందిరమ్మకలల సాకారం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ప్రతి పల్లెలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా కొనసాగుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ఆ పథకాలు పేద ప్రజలకు నారాయణపేట జిల్లాలోని ఏ గ్రామీణ ప్రాంతాలకు చేరలేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేసీఆర్ గ్రామీణ ప్రాంతాలకు ఎంతో అభివృద్ధి చేస్తానని ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేశారని అన్నారు.నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లను గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందుతుందని అన్నారు. నారాయణపేట మండలంలోని జాజాపూర్ గ్రామంలో 52 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే చెందుతుందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం

**- బీజేపీ భారీ నారీశక్తి వందన్ పాదయాత్ర**

**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**



చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ శేరిలింగంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో 'నారీశక్తి వందన్ పాదయాత్ర' ఘనంగా జరిగింది. చందానగర్ అంబేద్కర్ విగ్రహం నుండి బి.హెచ్.ఈ.ఎల్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈయాత్రలో బీజేపీ రాష్ట్ర నేతలు రామచంద్ర రావు, రవికుమార్ యాదవ్, శిల్పా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న మహిళా రిజర్వేషన్లను అమలు చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదేనని కొనియాడారు. 2029 నాటికి సుమారు 273 మంది మహిళలు లోక్సభలో అడుగుపెట్టేలా ఈ చట్టం మార్గం సుగమం చేసిందని, ఇది భారత రాజకీయాల్లో నవశకమని పేర్కొన్నారు. ఉజ్వల, సుకన్య సమృద్ధి, ఆవాస్ యోజన వంటి పథకాలతో ఇప్పటికే మహిళలను ఆర్థికంగా ఆదుకున్న కేంద్రం, ఇప్పుడు రాజకీయంగానూ సముచిత స్థానం కల్పించిందని తెలిపారు.?ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, భారీ సంఖ్యలో మహిళా మోర్చా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికవర్ ఆసుపత్రిలో ఇద్దరు చిన్నారులకు పునర్జన్మ

**- క్లిష్టమైన సర్జరీలు విజయవంతం**



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**

శేరిలింగంపల్లిలోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి ఇద్దరు చిన్నారుల ప్రాణాలను కాపాడారు.?1. 8 ఏళ్ల బాలికకు భారీ కణితి తొలగింపు.?తీవ్రమైన మెడ నొప్పి, శ్వాస ఇబ్బందితో వచ్చిన ఎనిమిదేళ్ల బాలికను పరీక్షించగా, ఆమె ఛాతి వెనుక భాగంలో 500 గ్రాముల భారీ కణితి (గ్యాంగ్లియోన్యూరోమా) ఉన్నట్లు గుర్తించారు. ఇది వెన్నెముక మరియు ప్రధాన రక్తనాళాలకు (అయోర్టా) అత్యంత సమీపంలో ఉండటంతో శస్త్రచికిత్స ఎంతో ప్రమాదకరంగా మారింది. కార్డియోథొరాసిక్ సర్జన్ డా. ప్రమోద్ రెడ్డి కందకురే, న్యూరో సర్జన్ డా. అనీల్ బృందం చాకచక్యంగా వ్యవహరించి, ఎటువంటి నరాల నష్టం లేకుండా కణితిని విజయవంతంగా తొలగించారు.?2. 4 ఏళ్ల బాలుడికి అరుదైన గుండె శస్త్రచికిత్స ?పుట్టినప్పటి నుండి గుండె లోపంతో బాధపడుతున్న నాలుగేళ్ల బాలుడికి సింగిల్ వెంట్రికల్ ఫిజియాలజీ అనే సమస్య ఉన్నట్లు తేలింది. దీనివల్ల బాబు ఒంట్లో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి, పెదాలు, గోర్లు నీలం రంగులోకి మారిపోయేవి.?డా. ప్రమోద్ రెడ్డి బృందం బాలుడికి క్లిష్టమైన హృదయ శస్త్రచికిత్స నిర్వహించి రక్తప్రసరణను సరిచేసింది. ప్రస్తుతం బాబు కోలుకుంటున్నాడు.?వైద్యుల సూచన చిన్నారుల్లో శ్వాస ఇబ్బందులు లేదా అసాధారణ నొప్పులు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులను సంప్రదించాలి. ఆధునిక సాంకేతికత, సమన్వయంతో కూడిన వైద్యం వల్ల ఇలాంటి క్లిష్టమైన కేసుల్లోనూ విజయం సాధించవచ్చు. - డా. ప్రమోద్ రెడ్డి కందకురే

# 9వ రోజు ఆర్టీజన్ కార్మికుల మెరుపు సమ్మె..!

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16, మన సాక్షి :**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఆర్టీజన్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె లో గురువారం మెరుపు సమ్మె కొనసాగించారు. ట్రేడ్ యూనియన్ లో మద్దత్తు వేసుకున్నప్పటికీ ఎలాంటి భయాలకు పోకుండా మొక్క విశ్వాసంతో తమ లక్ష సాధన కోసం చావో, రేవో ప్రభుత్వం నేరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని కార్మికులు భీష్మించుకుని కూర్చున్నారు. ప్రభుత్వం భయం పెట్టినా మా న్యాయమైన డిమాండ్లు నేరవేరే లకు ప్రభుత్వంతో శాంతి యుతంగా పోరాడతామని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టి.వి.ఏ.ఈ. జె.ఏ.సి. డివిజన్ చైర్మన్ నర్సిములు , ఉమ్మడి జిల్లా కన్వినర్ దిల్ దార్, కో చైర్మన్.లక్ష్మీకాంత్, వినోద్ కుమార్, రమేష్ , శ్రీధర్, బాల్ రాజు ,ప్రచార కార్యదర్శి జె. వెంకటెష్ ,గుండప్పా, మహమ్మద్ , శశికాంత్ దూలం, తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'పై అవగాహన

**ఆర్మూర్,ఏప్రిల్ 16,మన సాక్షి:**



ఆలూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన –ప్రగతి 99 రోజుల ప్రణాళిక' పై మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడం, స్థానిక సమస్యలను గుర్తించి అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతు భరోసా, మహాలక్ష్మి,గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు,సన్నారకం వరి బోనస్,మహిళా శక్తి బ్యాంక్ లింకేజ్, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు వంటి సంక్షేమ పథకాల అమలుపై సవివరంగా వివరించారు.ఎంపీడీఓ మాట్లాడుతూ.. అధికారులు గ్రామ స్థాయిలోకి వెళ్లి ప్రతి అర్హుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని, ప్రజల సూచనలతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఏవో రాంబాబు, డాక్టర్ సందీప్, సర్పంచ్లు యల్లా సాయిరెడ్డి, ముక్కెర విజయ్, ఇట్టెడి లింగారెడ్డి, మచర్ల చిన్నయ్య, గంగోల్ల సుస్మిత, పుప్పాల పుష్ప, కొండ్ర కమల, తోగారి భూషన్, కొర్ర కిషన్, కట్ట నర్సయ్య పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి విరాళం

**వెల్దండ,ఏప్రిల్ 16,మన సాక్షి:**



వెల్దండ మండలం బొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ధాతలు విరాళాలు అందజేశారు. అదే గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఆనంద్ తన వ్యక్తిగతంగా రూ. 5169 , యువ నాయకులు కొమ్ము భాస్కర్ 5 వేల రూపాయలు , పకాడి వెంకటయ్య, పకాడీ లక్ష్మయ్య శ్రీశైలం, కొమ్ము సరిత రామదాసు తలా 2000 వేల రూపాయలు విరాళం గురువారం కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు ధాతలను సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము పర్వతాలు,పడాల వెంకటేష్,కొమ్ము రవి, పకాడి రామాంజనేయులు, పకాడి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డిఫెన్స్ డ్రైవింగ్ చేస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16, మన సాక్షి :**



99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్ర మంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం గా చేపట్టిన అరయవ్ అలైన్ కార్యక్రమం గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యం లో ఆటో, టాక్సీ, టిప్పర్, ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ డ్రైవర్లకు నిర్వహిస్తున్న కంటి పరీక్ష లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొ న్నారు. ముఖ్యంగా వయస్సు పెరుగుతున్న కొద్దీ కంటి చూపు మందగించడం, కలర్ బ్లైండ్ వంటి సమస్యలు రావ చ్చని, అందువల్ల డ్రైవర్లు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవడం అవసర మని సూచించారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్య క్రమం చేపట్టినట్లు తెలిపారు. గతంలో కంటి పరీక్షలు చేసు కున్న కొంతమందికి కళ్లద్దాలు అందించారు.ఈ శిబిరం ద్వారా 100 మందికి పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీ క్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడ గలదని ఎస్పీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్డీవో రామ్ చందర్, డీఎంహెచ్ఓ జయ చంద్ర మోహన్, ఆర్టీఓ మేఘా గాంధీ, ఆర్టీఓ మెంబర్ పోశల్ రాజేష్, సీఐ శివశంకర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్లు సునీల్, మల్లిక, సాయి ఆదిత్య, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య, సిబ్బంది డ్రైవర్లు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేనిదే నో ఎంట్రీ..!

**మందమర్రి,ఏప్రిల్ 16,మన సాక్షి:**




రహదారి భద్రతపై అవగాహన పెంచడం,రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యభాగంగా మందమర్రి పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మందమర్రి పోలీస్ స్టేషన్కు ఎం.ఆర్.ఓ. కార్యాలయానికి మున్సిపల్ కార్యాలయానికి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు,పెట్రోలు బంక్లలో 'నో హెల్మెట్ -- నో ఎంట్రీ' నిబంధనను కఠినంగా అమలు చేయనున్నట్లు సీఐ పర్స రమేష్ స్పష్టం చేశారు.గురువారం మందమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాద సమయంలో తలకు గాయాలు కాకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వాహనదారులు హెల్మెట్ ధరించి రావాలని, లేనిపక్షంలో లోపలికి అనుమతించబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ, పోలీసు సిబ్బంది,స్థానిక ప్రజా ప్రతినిధులుపాల్గొన్నారు

# గౌరవ వేతనం తీసుకోకుండా పని చేస్తా..!

**తుంగతుర్తి,ఏప్రిల్ 16, మన సాక్షి:**



తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి మండలంలోని గుండెపురి గ్రామంలో గురువారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తిరుమలగిరి ఎంపీడీవో ఆఫీసులో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండల సర్పంచులకు అధికారులకు మండల స్థాయి సమీక్ష సమావేశం జరిగినందున గుండేపురి సర్పంచ్ కొమ్ము సోమన్న తెలంగాణ ప్రభుత్వం సర్పంచులకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని తీసుకోకుండా స్వచ్ఛందంగా గుండెపురి ప్రజలకు సేవ చేయడానికి స్వచ్ఛందంగా పనిచేస్తానని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యకి లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ గుండెపురి గ్రామ ప్రజలందరూ కలిసి గౌరవ ప్రదమైన సర్పంచ్ గా ఎన్నుకొని గౌరవం ఇచ్చారు కాబట్టి ఇంతకంటే పెద్ద గౌరవం లేదని భావించి తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నగౌరవేతనాన్ని(జీతం )తీసుకోకుండా పనిచేస్తానని తెలియజేయడం జరిగింది. అందుకుగాను డిపిఓ సర్పంచ్ ని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రమేష్ బాబ ,డిపిఓ యాదయ్య, ఎమ్మార్వో హరిప్రసాద్,ఎంపీడీవో లాజరు ఎస్సై వెంకట్ రెడ్డి , ఎంఈఓ శాంతియ్య గుండెపురి పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఇతర అధికారులు మండల సర్పంచులు,మండల పంచాయతీ కార్యదర్శులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# ఆరోగ్య రాజంపేటయే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**రామసముద్రం, ఏప్రిల్ 16,మన సాక్షి:**



ఆరోగ్య రాజంపేటయే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా ఒక్కో అవయవానికి సంబంధించి ఒక్కో నెలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. గురువారం రాజంపేట పట్టణం, ఏ.బి చంద్రారెడ్డి గార్డెన్స్ నందు రేడియంట్ వరల్డ్ ఫౌండేషన్ మరియు సురేంద్ర ఐ హాస్పిటల్ చీఫ్ డాక్టర్ సురేంద్ర వైద్య బృంద సహకారంతో నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పూర్తితో లోకేష్ బాబు సూచనల మేరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ సుండుపల్లె వీరబల్లెనందలూరు ఒంటిమిట్ట సిద్ధవటంప్రాంతాలలో కూడా వైద్య శిబిరాలు ప్రత్యేకంగా నిర్వహిస్తామని జగన్ మోహన్ రాజు తెలిపారు. అంతకుముందు రాజంపేట పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా ప్రజలు ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు వినియోగించుకున్నారని తెలియజేశారు. వైద్య శిబిరంలో రేడియంట్ ఫౌండేషన్ టీమ్ సభ్యులను చమర్తి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

**అర్వపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**



గ్రామ పంచాయతీల ఎన్నికలు జరిగి సర్పంచి పాలకవర్గం ఏర్పాటు అయిన రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇప్పటివరకు నిధులు రాక అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని బిఆర్ఎస్ , సర్పంచుల ఫోరం నాయకులు అన్నారు. గురువారం బి ఆర్ ఎస్ సర్పంచులు మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రెండున్నర సంవత్సరాల తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగి సర్పంచ్ వార్డు సభ్యులు గెలవడంతో మా గ్రామాలు అభివృద్ధి జరుగుతుందని సంతోషపడ్డ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకుండా నిరాశ పరిచిందని అన్నారు. ప్రజాపాలన పేరుతో గ్రామపంచాయతీలలో టెంట్లు కుర్చీలలో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని అన్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, వల్లపు గంగయ్య, కర్నాటి వెంకన్న, బొడ్డు ఇందిరా సోమరాజు, మేడి వీరస్వామి, అంకిరెడ్డి వీరాంజనేయులు ముదిరాజ్, బానోత్ సైదులు, నున్న యాదగిరి, కాంతమ్మ హరిలాల్, కలకోట్ల శైలేందర్ పాల్గొన్నారు

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**కేతేపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**



జత కలిగిన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యం అని నకిరేకల్ మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా కేతేపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, తదితర పథకాల ప్రస్తుత పథకాలు ప్రజలకు అందుతున్న విధానం, ప్రభుత్వం రూపొందించే రాబోయే ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఎంపీడీవో జి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం శ్రీనివాస్, తాసిల్దార్ రమాదేవి, మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# క్వింటాకు 5 కేజీలు నష్టపోతున్న రైతులు..!

**కేతేపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**



కేతేపల్లి మండలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చిన్న వెంకులు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించినటువంటి పంట మండలంలోని కొనుగోలు కేంద్రాలకు తరలించగా నాణ్యత ప్రమాణాల పేరిట కింటాకు 5 కిలోలు కటింగ్ చేస్తున్నార ని, మిల్లర్లు, యంత్రాంగం కలసి రైతులను దోచుకుంటున్నారని అన్నారు. ఈ విధానంతో రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోతున్న అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తుందని, తాలు నాణ్యత పేరుతో ఎలాంటి కోతలు లేకుండా కాంటాలు వేయాలని, అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి చింతపల్లి లూర్దు మారయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలో శాశ్వత మార్కెట్ లేనందున రైతులు రోడ్ల మీదనే ధాన్యపు రాశులను పోసి కొనుగోలు కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారని, దీనితో రోడ్లపై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. మండల కేంద్రంలో శాశ్వత వ్యవసాయ మార్కెట్ నిర్మాణం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కోట లింగయ్య, శ్రీను, చౌగోని నాగయ్య, సుంకరి సత్తయ్య, వంగూరి వెంకన్న, పెరిక మల్లయ్య, చౌడయ్య, చందూరు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు,ప్రజా ప్రతినిధులు కలిసి పని చేయాలి

**అర్వపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**




గ్రామ మండల స్థాయిలో అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలతో కలిసి పనిచేసే అభివృద్ధిని సాధించాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో జరిగిన ప్రజా పాలన , ప్రగతి ప్రణాళిక, మండల స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండల స్థాయిలో అన్ని శాఖల పనితీరును, గ్రామ పరిపాలన సమావేశాలు సమీక్షలను, పరిశీలించారు. పోలీస్ శాఖ, వ్యవసాయ, రెవిన్యూ, ఆరోగ్య, విద్యుత్, ఉపాధి హామీ, విద్య, మహిళా సమాఖ్య, శాఖలకు సంబంధించిన అధికారులందరూ పాల్గొని వారి శాఖలో జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను అభివృద్ధి కార్యక్రమాలను నివేదించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు అన్ని గ్రామాల సర్పంచులు, పాల్గొన్నారు. గ్రామాలలో వారికున్న సమస్యలను అధికారులకు తెలియజేశారు.

**మా గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండల సమావేశంలో మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్ మాట్లాడుతూ అర్వపల్లి మండల కేంద్రానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం లేదని, ఇక్కడి కళ ్ల రైతులకు రైతు భరోసా గాని రైతు భీమా గాని అందటం లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. గత 50 సంవత్సరాలు నుండి, గ్రామంలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేసిందని వాటిని లబ్ధిదారులు కట్టుకున్నట్లు తెలిపారు. అప్పుడు లేని రూల్స్ ఇప్పుడు ఎందుకు అమలు చేస్తున్నారు తెలియడం లేదని అన్నారు. వందల సంవత్సరాల నుండి గ్రామంలో నివసిస్తూ
వారు ఉంటున్న పాత ఇంటి స్థలంలోనే ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే అవకాశం ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి వినతిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగారం సర్కిల్ సిఐ నాగేశ్వర రావు, తాసిల్దార్
శ్రీకాంత్, ఎం ఏ ఓ సందీప్ ఏపిఎం రాంబాబు ఏపీవో ఉపేందర్ ఎంఈఓ బాలు నాయక్ ఎస్ఐ ఈత సైదులు డాక్టర్ భూక్య నగేష్ నాయక్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించండి..!

**అర్వపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**



అర్వపల్లి మండల కేంద్రంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి కాంటాలు వేయాలని రైతులు ప్రభుత్వానికి అధికారులను ప్రాదేపడుతున్నారు. యాసంగి సీజన్ కోతలు ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు దాదాపు 100 లారీల వరకు ధాన్యం, కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చి రాశుల పోశారు. వాతావరణం ఏ క్షణాన ఏవిధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ విచిత్ర పరిస్థితి ఏంటి అంటే వంద లారీల దొడ్డు ధాన్యం ఉన్న కేంద్రం లేదు, ఒక్క గింజ సన్నధాన్యం లేకుండా ఆ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఉన్నదాన్యం కొనుగోలు చేయకుండా లేని ధాన్యం కొరకు మరో 20 రోజుల వరకు రాణి సన్నధాన్యానికి కేంద్రం ప్రారంభించడం, మార్కెట్లో ఉన్న దొడ్డు ధాన్యాన్ని కొనకుండా, కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకుండా, రైతులను అయోమయానికి గురిచేస్తున్నారు. వరి చేలు కోయని రైతులు వడగండ్ల వాన వస్తే మా పరిస్థితి ఏమిటి అని ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యం కల్లాలలో ఆరబెట్టిన రైతులు వర్షం వరదలు వస్తే మా పరిస్థితి ఏమిటని భయాందోళనకు గురవుతున్నారు. ప్రజా ప్రభుత్వం, రైతు ప్రభుత్వం, ప్రజా సంక్షేమ ప్రభుత్వం అంటూ మాటలతో కాలం వెలదీస్తున్నారు తప్ప, రైతులకు ఉపయోగపడే పని ఏది చేయటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన పంట ప్రభుత్వం కొనుగోలు చేసి
తమకు నగదు ఇచ్చేంతవరకు కూడా గ్యారెంటీ లేకపోవడంతో రైతులు తీవ్రమైన ఆందోళన లో ఉన్నారు. మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ప్రజల సహకారంతో రైతుల సహకారంతో ప్రజా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని సిపిఎం మండల కార్యదర్శి వాజ్జ శ్రీనివాస్ అన్నారు.

# గుర్రంపోడు ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఘన విజయం

**గుర్రంపోడు, ఏప్రిల్ 16,మన సాక్షి :**



తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో గుర్రంపోడు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను,వారి తల్లిదండ్రులను కళాశాల ప్రిన్సిపాల్ జి. రాగిణి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ద్వితీయ సంవత్సరంలో పోలే స్వాతి (957), తరి అఖిల (945), బందారు కీర్తి (910), కె. వైష్ణవి (620) అత్యుత్తమ మార్కులు సాధించగా.. ప్రథమ సంవత్సరంలో కె. ప్రేమలత (458), బి. సింధు (409), ఎం. మహేశ్వరి (390) తమ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థుల పట్టుదల, కష్టపడే తత్వాన్ని ప్రిన్సిపాల్ కొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# అటవీశాఖ ప్రధాన సంరక్షణ అధికారిని కలిసిన జిల్లా నాయకులు



**సూర్యాపేట రూరల్,ఏప్రిల్ 16,మన సాక్షి:**

కొత్తగూడెం నుండి హైదరాబాద్ కు వెళ్లే మార్గమధ్యలో సూర్యాపేట హోటల్ సెవెన్ లో తెలంగాణ అట్టవిశాఖ ప్రధాన సంరక్షణ అధికారి డాక్టర్ సి సువర్ణ ఐఎఫ్ఎస్సి కొరకు ఆగగా సూర్యాపేట టింబర్ అసోసియేషన్ జిల్లా నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కని బహుకరించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్, సామిల్ అండ్ టింబర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తౌడోజు సలేంద్ర చారి, పట్టణ అధ్యక్షుడు పర్వతం సైదాచారి, రిటైర్డ్ సెక్షన్ ఆఫీసర్ నారాయణరావు, జిల్లా కోశాధికారి బహు రోజు ఉపేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై విస్తృత చర్చలు

**అనంతగిరి,ఏప్రిల్ 16,మన సాక్షి:**



సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై మండల స్థాయి సమీక్షా సమావేశం గురువారం రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని ఆలపిస్తూ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా సమావేశాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, వివిధ సంక్షేమ పథకాల అమలు తీరు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు సమగ్రంగా సమీక్షించారు. ప్రతి శాఖకు సంబంధించిన పనితీరును విశ్లేషిస్తూ, లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరచాలని, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సమావేశంలో మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు వ్యక్తం చేశారు...

# రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు




**గుర్రంపోడు,ఏప్రిల్ 16,మన సాక్షి:**

నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని గాలి జంగయ్య ఫంక్షన్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై మండలంలోని ఆటో టాక్సీ, భారీ వాహనాల డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల పట్ల దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా క్రమశిక్షణతో యూనిఫాం ధరించాలని సూచించారు. వాహనానికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికేట్ పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని ఆదేశించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని అలా చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. వాహనాలకు రియర్ వ్యూ మిర్రర్లు ఉండాలని హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రమాదాల నుండి ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రాణాంతకమని అటువంటి చర్యలకు పాల్పడవద్దని కోరారు. డ్రైవర్లకు కంటి చూపు సమస్యలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సురక్షిత ప్రయాణానికి డ్రైవర్ల బాధ్యతాయుత ప్రవర్తనే కీలకమని వివరించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది,మండలంలోని డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఆర్టిజన్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

నల్లగొండ,ఏప్రిల్ 16,మన సాక్షి:




టీవీ ఏఈ జెఏసి రాష్ట్ర కమిటీ పిలుపు నిరవధిక సమ్మెలో భాగంగా తొమ్మిదవ రోజు గురువారం ఆర్టిజన్ కార్మికులు అర్ధనజ్ఞ ప్రదర్శనతో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. అర్చన ప్రదర్శనకు బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ ప్రదర్శనకు అర్జెంట్ కార్మికులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ సందర్భంగా టీవీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఇట్టబోయిన లింగస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం యాజమాన్యం కార్మికులను సమస్యలపై స్పందించకుండా వారిని టెర్మినేట్ చేస్తామని భయభ్రాంతులకు గురి చేయడం చేసిన వారి మొండి వైఖరిని ఖండిస్తూ కార్మికులు వారి బెదిరింపులకు గురికాకుండా అధిక సంఖ్యలో పాల్గొని 9వ రోజు దీక్షను విజయవంతం చేయడం జరిగిందన్నారు ..ప్రభుత్వం వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాలను వెంటబెడుతూ కార్మికులకు రావలసిన న్యాయమైన డిమాండ్లను వారికి ఇచ్చే విధంగా బిజెపి పార్టీ తరఫున మీకు పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా 8వ రోజు మేనేజ్మెంట్ జేఏసీతో చర్చలు జరిపిన విఫలం కావడంతో ఒక కార్మికుడు గోడ కొమ్మలు అనే వ్యక్తి మనస్థాపంతో గుండె పోటు రావడంతో చనిపోవడం జరిగిందని, వారికి ఆత్మకు శాంతి కలగాలని ఒక రెండు నిమిషాలు మౌనం పాటించి ఈరోజు దీక్షలో 12 మంది ఒకరోజు నిరాహార దీక్ష లో అర్ధ నగ్న ప్రదర్శన చేయటం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జిట్టబోయిన లింగ స్వామి జిల్లా నాయకులు లింగారెడ్డి,అద్దంకి వెంకన్న, పోతపాక విజయ్ కుమార్, కోటి, విజయ్ రెడ్డి,పరమేష్, ఉపేందర్, రమేష్,వెంకన్న ,లచ్చిరెడ్డి , వెంకట్ రెడ్డి,పెరిక శేఖర్ ,రఫియా, ప్రసన్నకుమార్,అరుణ,లక్ష్మి, శైలజ, రాజేష్, మైల సైదులు నాగమణి, కరుణ,కళావతి,ఆరీఫా,భారతి, నాగార్జున కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తుంగతుర్తి,ఏప్రిల్ 16, మన సాక్షి:



తుంగతుర్తి మండల పరిధిలోని సంగెం గ్రామంలో నూతన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏసంగి దొడ్డు ధాన్యం ప్రారంభించడం జరిగిందన్నారు. తుంగతుర్తి మండలంలో ఇప్పటివరకు 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు ధాన్యం ఆరబోసి శుభ్రం చేసిన ధాన్యాన్ని తీసుకువచ్చి మ్యాచ్ వచ్చిన తర్వాత 17 శాతం తేమ లేకుండా ఆరబెట్టిన సరుకును కాంటాలు వేయడం జరుగుతుందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం 2886 రూపాయలు బి గ్రేడ్ ధాన్యం 2680 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సొసైటీల ద్వారా రైతు కమిటీల ద్వారా మహిళా సంఘాల ద్వారా దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మీ కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యాలు ఉన్న మా మార్కెట్ కమిటీ సభ్యులకు అధికారులకు తెలియపరచాలని ప్రతి గ్రామంలోని ఐకెపి కేంద్రాలలో తార్బల్స్ వాటితోపాటు వెయిట్ మిషన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నీకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండలంలోని తాసిల్దార్ కార్యాలయాలు అగ్రికల్చర్ అధికారులు మార్కెట్ అధికారులు సహకారంతో దాన్యం కొనుగోలు కేంద్రాలు నడపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేష్ బిక్షం ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ రైతులు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రథమ స్థానం సాధించిన పేదింటి విద్యార్థిని సాయుధ సాహిత్య..!

తుంగతుర్తి,ఏప్రిల్ 16, మన సాక్షి:



తుంగతుర్తి మండలంలోని వెంపటి గ్రామానికి చెందిన నిరుపేద అయిన ఎలగందుల మల్లేష్, హైమావతి ప్రథమ పుత్రిక సాయుధ సాహిత్య నేత ఇంటర్ మొదటి సంవత్సరం సి.ఇ.సి గ్రూపులో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 194 మోడల్ స్కూల్ లలో టాపర్ గా నిలిచారు. 500 మార్కులకు సిఇసి గ్రూపులో 483 మార్కులు వచ్చాయి. సాహిత్య నేత నాగారం మండలం పసునూరు మోడల్ స్కూల్లో మొదటి సంవత్సరం చదువుతుంది. సాహిత్య నేత మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి మార్కులు తెచ్చుకున్నానని ఇకముందు కూడా బాగా రాణిస్తానని తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులతో పేరు తెచ్చుకుంటానని ఆమె తెలియజేశారు. తల్లిదండ్రులు తలను కష్టపడి చదివిస్తున్నారని వారికి మంచి పేరు తెస్తానని ఉన్నత చదువులు చదివి వారికి అండగా ఉంటానని ఆమె తెలియజేశారు. అంతేకాకుండా డ్రాయింగ్స్ స్కిల్స్ లో మంచి ప్రతిభ సాయుధ సాహిత్యలో ఉండడమే కాకుండా పలు పథకాలు రాష్ట్రస్థాయిలో కూడా అందుకుంది.

# మచ్చర్లలో మహిళ అనుమానాస్పద మృతి..!

## - ఒంటి పై నగలు మాయం

ఆర్మూర్,ఏప్రిల్ 16,మన సాక్షి:



ఆలూర్ మండల పరిధిలోని మచర్ల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. స్థానిక గ్రామానికి చెందిన సుంకరి జయపాల (52), తండ్రి దేవన్న అనే మహిళ తన నివాసంలోనే అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. బీడీలు చుడుతూ జీవనం సాగించే ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన వివరాల్లోకి వెళ్తే.. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జయపాల తన ఇంటి ముందు కూర్చుని అన్నం తింటుండగా ఎదురింటి వారు చూశారు. అయితే, రాత్రి 8 గంటలు దాటినా ఆమె ఇంటి బయటకు రాకపోవడం,ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం కలిగింది. వెంటనే వారు ఇంటికి చేరుకోగా తలుపులు లోపలి నుండి గడియ పెట్టి ఉన్నాయి. దీంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులను పైకి లేపి లోపలికి వెళ్లి చూడగా, జయపాల తన బెడ్‌రూమ్‌లోని మంచంపై మృతి చెంది పడి ఉంది. మృతురాలి ఒంటిపై ఉండాల్సిన బంగారు తాడు,చెవి కమ్మలు మరియు కాళ్ల మెట్టెలు మాయమవ్వడంతో,ఎవరో దుండగులు ఆమెను హతమార్చి నగలతో పరారైనట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతురాలి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. క్లూస్ టీమ్ మరియు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి,మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తును ప్రారంభించినట్లు ఆర్మూర్ సిఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

# నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తుంగతుర్తి,ఏప్రిల్ 16, మన సాక్షి:

తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని నూతనకల్ మద్దిరాల మండలాలలోని పలు గ్రామాలలో ఐకెపి కేంద్రాల ప్రారంభోత్సవానికి తుంగతుర్తి శాసనసభ్యులు ఉదయం 10:30 గంటలకు కొనుగోలు కేంద్రంలో నూతనంగా ప్రారంభోత్సవం చేయడానికి రావడం జరుగుతుందన్నారు. నూతనకల్ తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి శాసనసభ్యులు మందుల సామిల్ మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి. రాష్ట్ర రైతు కమిటీ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ తో పాటు పలు మండలాల తాసిల్దార్ అగ్రికల్చర్ అధికారులు ఐకెపి ఎపిఎం అధికారులు పలు గ్రామాల సర్పంచులు పలు గ్రామాల మహిళా సంఘాలు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# ఘనంగా కిసాన్ నగర్ హిందూ సమ్మేళనం

కరీంనగర్,ఏప్రిల్ 16,మన సాక్షి :



కరినగర్ నగరంలో కిసాన్ నగర్ బస్తీలో చత్రపతి శివాజీ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు. గోపూజతో కార్యక్రమం అనంతరం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరినగర్ విభాగ ప్రచార ప్రముఖ్ తడి గొప్పల శంకరయ్య మాట్లాడుతూ సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజనతో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని,హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం, ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటిత శక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని, సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన మంగళంపల్లి శ్రీనివాస్ శర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమ్మేళనము కార్యనిర్వహణ సమితి అధ్యక్షుడు పసుల మహిపాల్ ప్రధాన కార్యదర్శి, గాజుల కృష్ణ జన జాగరణ సమితి అధ్యక్షుడు, ఎన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మేంగని రాజయ్య, ఉపాధ్యక్షులు ఉప కార్యదర్శులు , బస్తీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకటే ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలి

కేతేపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:



రైతు భరోసా,పిఎం కిసాన్, ఫార్మర్ రిజిస్ట్రీ, యూరియా బుకింగ్ లకు ఒకటే ఫోన్ నెంబర్ ను అనుసంధానం చేసుకోవాలని, నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి బి. పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వరకు ఈ నమోదుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగంలో పారదర్శకత పెంపు, అవకతవకల నివారణ కోసం ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని అనుసరిస్తోంది. పంటల సాగు, ఎరువుల వినియోగం, ధాన్యం కొనుగోళ్లను సులభతరం చేయడానికి పలు మార్పులు చేపట్టిందని ఆయన తెలిపారు. ఎరువుల బుకింగ్ కోసం మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టిందని, చాలామంది రైతులు పట్టాదారు పాసుపుస్తకాలకు సరైన మొబైల్ నంబర్ అనుసంధానం చేయకపోవడంతో రైతు భరోసా, పీఎం కిసాన్, యూరియా బుకింగ్, ధాన్యం విక్రయ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు ఇతరుల నంబర్ల ద్వారా లావాదేవీలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందిని, ఈ సమస్యలు నివారించేందుకు ప్రభుత్వం ఫోన్ నంబర్ల అనుసంధానానికి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి, ఈ నెల 20వ తేదీ వరకు నమోదు పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించిందని ఆయన తెలిపారు.

# ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

తిరుమలగిరి (సాగర్) ఏప్రిల్ 16, మన సాక్షి :



మండలంలో సాగర్ హైవేపై తిరిగే ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై తిరుమలగిరి (సాగర్) ఎస్సై వీరశేఖర్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎర్రివే అలివే "కాంపెయిన్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నియమాలపై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు .ఆటోలలో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు --- డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తదితరాలను సక్రమంగా కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

# కొత్త బోరు మోటార్ ప్రారంభం

వెల్దండ,ఏప్రిల్ 16,మన సాక్షి:



వెల్దండ మండల కేంద్రంలో వేసవి కాలం నీటి ఎద్దటీని దృష్టిలో ఉంచుకొని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ కొత్త బోరు మోటార్ ఏర్పాటు చేయడం జరిగింది. గురువారం వెల్దండ గ్రామ సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మౌలిక వసతులను ఏర్పాటు చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్సమోని శ్రీనివాస్,5వ వార్డు సభ్యులు రేవల్లి మానస రాజు, గుద్దే కిష్టాల్ , రేవల్లి మానస రాజు , బొక్కల శ్రీనివాస్, అన్నెపు కృష్ణ, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అస్తిత్వం పై బీజేపీ దాడి సరైనది కాదు..!

సూర్యాపేట,ఏప్రిల్ 16,మన సాక్షి:

తెలంగాణ ఏర్పాటును భారత్- పాక్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు అమరవీరుల త్యాగాలను, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తీవ్రంగా కించపరచడమేనని ఎన్ ఎస్ యి ఐ మండల అధ్యక్షులు లోడంగి మహేష్ యాదవ్ ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ
1200 మంది విద్యార్థుల బలిదానాలతో, సుదీర్ఘ ప్రజాస్వామ్య పోరాటం ద్వారా సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని మత విద్వేషాల కారణంగా జరిగిన దేశ విభజనతో పోల్చడం బీజేపీ అజ్ఞానం, విద్వేషపూరిత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. తెలంగాణలో ఓట్లు అడుగుతున్న బీజేపీ నేతలు,ఢిల్లీలో రాష్ట్ర గౌరవాన్ని అవమానిస్తుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

## - కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక వాయిదా

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16, మన సాక్షి :



నారాయణపేట మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిల్లులకు సంబంధించి పలు ప్రతిపాదనలను కౌన్సిల్ ఆమోదించింది. కాగా ఈ సమావేశంలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక జరగాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. మీడియాకు అనుమతించాలి:మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి మీడియా సభ్యులను అనుమతించాలని కాంగ్రెస్ కౌన్సిలర్ లు సమావేశంలో నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో కాంగ్రెస్ కౌన్సిలర్లు మహేష్, శ్వేత వెంకటేష్ గౌడ్, బండి రాజేశ్వరి,గొల్ల రవితేజ,రాజేష్ ఘూట్, అరుణ, భాగ్యవతి ఉన్నారు. సమావేశంలో కమిషనర్ నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు,అధ్యాపకులను అభినందించిన జిల్లా కలెక్టర్..!

నారాయణపేట టౌన్,ఏప్రిల్ 16, మన సాక్షి :



ప్రభుత్వం కల్పించే వసతి సదుపాయాలతో మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థిని, విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల అధ్యాపక బృందం, సిబ్బందిని అభినందించారు. గురువారం కలెక్టర్ చాంబర్లో నారాయణపేట, మక్తల్ మైనారిటీ రెసిడె న్షియల్ కళాశాలలో ఇంట ర్మీడియట్ సెకండ్ ఇయర్ ఫలితాలలో 100 శాతం ఫలితాలు సాధించిన విద్యార్థినీ,విద్యార్థులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం బాలికల విద్యకు ప్రోత్సాహం అందిస్తున్నదని దానిని అంది పుచ్చుకుని ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. నారాయణపేట బాయ్స్ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ లో 95 శాతం ఫలితాలు సాధించడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎం డబ్ల్యూ ఓ రషీద్, విజిలెన్స్ అధికారులు జమీర్ ఖాన్, మసూద్, జహీర్, నారాయణపేట ప్రిన్సిపాల్ జగదీష్, మక్తల్ బాలికల ప్రిన్సిపల్ ఎలిజబెత్ రాణి ,సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రవి కుటుంబానికి ఆర్థిక సహాయం

బషీరాబాద్,ఏప్రిల్ 16, మన సాక్షి:



బషీరాబాద్ మండల కేంద్రంలో టాకి తాండకు చెందిన ం ౕ వి ం ా ద; ో డ్ మరణించిన విషయం తెలుసుకుని సొసైటీ మాజీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ శంకర్ రాథోడ్ ద్వారా 5000 రూపాయలు అంత్యక్రియలకు వారి కుటుంబానికి అందజేయడం జరిగింది. ఆర్థిక సాయం అందుకున్న కుటుంబ సభ్యులు సొసైటీ మాజీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నీటి ఎద్దడికి సర్పంచ్ ప్రత్యేక చర్యలు

వెల్దండ,ఏప్రిల్ 16,మన సాక్షి:



వెల్దండ మండల పరిధిలోని చెదురుపల్లి గ్రామంలో సర్పంచ్ ధన్ సింగ్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్సీ వాడలోని ఎన్నో రోజుల నుండి పాడైపోయిన బోరింగును (బోరింగ్ మైసమ్మ ఇంటిదగ్గర)
మరమ్మత్తులు చేయించి నూతన బోర్ మోటర్ ను ఏర్పాటు చేయించి,నీళ్లు వచ్చే విధంగా చేయడం జరిగింది. బీసీ వాడలోని ఎడ్ల మణెమ్మ ఇంటి దగ్గర చాలా రోజుల నుండి పాడైపోయిన బోరింగ్ కు మరమ్మత్తులు చేయించి మోటర్ దింపి నీళ్లు వచ్చే విధంగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సహదేవ్ వార్డు సభ్యులు దేవేందర్, మద్రాసు లక్ష్మమ్మ, బాలయ్య, కొండ్రెడ్డి పద్మ తగుల బుచ్చయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలకు సమర్థవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**

**ఆమనగల్లు,ఏప్రిల్ 16,మన సాక్షి:**




ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో ప్రజలకు సమర్థ వంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.గ్రామాలు మున్సిపాలిటీల్లో సమస్యలు లేకుండా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. గురువారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధి దారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా,వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, జిల్లా ఉద్యమన అధికారి సురేష్, ఎంపీడీవో కుసుమ మాధురి, తహసిల్దార్ ఫహీం ఖాద్రి,సీఐ వెంకటేశ్వర్లు,మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎంఈఓ పాండు నాయక్, సీడీపీఓ శాంతి రేఖ, ఇరిగేషన్ ఏఈ తిరు సత్తయ్య, మిషన్ భగీరథ వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ గౌడ్, శోభారాణి, మండల సూపరిడెంట్ సుమలత, హౌసింగ్ ఏఈ శాలిని, ఎంపీఓ లక్ష్మణ్,ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి మైమున బేగం, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు మండ్లి రాములు,శానమని సత్యం,శ్రీను నాయక్, యాదయ్య,వెంకటయ్య, మౌనిక,ప్రశాంతి,శ్రీలత,ఉప సర్పంచ్ విజయరాథోడ్ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, నాయకులు మెకానిక్ బాబా, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విజయ్ నాయక్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్,కుమార్ గౌడ్, షాబొద్దీన్, శేఖర్ గౌడ్,లు ఉన్నారు.

# రామగుండంలో కో ఆప్షన్ ఎన్నిలకు నోటిఫికేషన్ జారీ..!

**గోదావరిఖని,ఏప్రిల్ 16,మన సాక్షి:**

రామగుండం నగరపాలక సంస్థలో కో -ఆప్షన్ పదవుల భర్తీకి గురువారం సాయంత్రం అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. జీవో నంబర్ 57, 58 అనుసరించి సీడీఎంఏ ఉత్తర్వుల ప్రకారం.. ఐదుగురు కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకోనున్నారు. ఈనెల 23 వరకు రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ నోటిఫికేషన్ జారీ చేశారు.

# 13 మంది ఫీల్డ్ అసిస్టెంట్ కు సన్మానం

**తుర్కపల్లి, ఏప్రిల్ 16,మన సాక్షి:**



యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఉపాధి హామీ పనిలో అత్యధిక ఎన్.ఎం.ఎం.ఎస్ ద్వారా హాజరు పరుస్తూ, అత్యధిక కూలీలతో పని చేసిన 13 మంది ఫీల్డ్ అసిస్టెంట్ ను గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు శాలువాతో సన్మానించి, 1000 రూపాయల ప్రైజ్ మనీ అందజేసి అభినందించారు. తుర్కపల్లి మండలానికి చెందిన ఇబ్రహీంపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ గడిపే ఇంద్రయ్య, తిరుమలపురం హుస్సేన్, ములకలపల్లి సుజాత లు మండలానికి చెందిన ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండడం పట్ల మండల అధికారులు,హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ నాగిరెడ్డి, అడిషనల్ డిఆర్డిఓ గుర్రం సురేష్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ మందడి ఉపేందర్ రెడ్డి, పాల్గొన్నారు..

# ప్లాస్టిక్ నిషేధంతో స్వచ్ఛ సూర్యాపేట లక్ష్యం

**మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**

**సూర్యాపేట,ఏప్రిల్ 16,మన సాక్షి:**




స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో సూర్యాపేట పట్టణానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తెచ్చుకోవాలంటే ప్రజల భాగస్వామ్యం కీలకమని మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో భాగంగా గురువారం భాస్కర్ ఇన్ బ్యాంకెట్ హాల్ లో పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు,ఫంక్షన్ హాల్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాల్సిన అవసరం ఉందన్నారు. తిన్న ఆహారం వృథా కాకుండా హోటల్ యజమానులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు.స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో సూర్యాపేట పట్టణాన్ని జాతీయ స్థాయిలో మరింత ముందుకు తీసుకెళ్లాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు చురుకుగా పాల్గొని సూర్యాపేటకు మరొక్కసారి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు.మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హనుమంత రెడ్డి మాట్లాడుతూ, 2026లో సూర్యాపేటను జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్లడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, మున్సిపల్ మేనేజర్ బుచ్చి బాబు,, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, డీఈ సత్యారావు,టీపీఓ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ యండి గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, యాదగిరి టెక్నికల్ పర్సన్ రంజిత్ కుమార్, ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్ దిలీప్ పట్టణంలోని ఫంక్షన్ హాల్ రెస్టారెంట్, హోటల్స్ యజనులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

**ఆమనగల్లు,ఏప్రిల్ 16,మన సాక్షి:**




పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు రావడం అభినంద నీయమని ప్రముఖ సంఘ సేవకులు ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రామకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో హైదరాబాద్ కు చెందిన శ్రీవాణి భాస్కర్ దంపతులు వారి కుమార్తె నిషిత పేరుతో నిషూ ఫౌండేషన్ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ పాపిశెట్టి రాము,మండల విద్యాధికారి పాండు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిషూ ఫౌండేషన్ వారితో కలిసి బ్యాగులు, ప్లేట్స్, వాటర్ బాటిల్, గ్లాస్ లు పంపిణీ చేశారు.తమ వంతు సామాజిక బాధ్యతగా విద్యార్థులకు అందించిన నిషూ ఫౌండేషన్ షూస్ నిర్వాహకులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జయకుమార్ సుజాత,పాఠశాల హెడ్మాస్టర్ విజేత, ఉపాధ్యాయులు కిరణ్,స్వాతి, శ్రీలత,పద్మ,శ్రీను నాయక్, శివకృష్ణ,భాస్కర్,శ్రీనాథ్, ఈదమయ్య, రమేష్, మహేష్, శేఖర్, జగన్, మహేష్, నారయ్య, ప్రేమలత, సంతోషి, కుమార్, వెంకటేష్, మల్లేష్,లు ఉన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**పెన్ పహాడ్ ఏప్రిల్ 16,మన సాక్షి:**



ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాలకు విస్తృతంగా అందే విధంగా కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో జానయ్య. తాసిల్దార్ రాజశేఖర్ రెడ్డి లు తెలిపారు.గురువారం పెన్ పహాడ్ మండల కేంద్రంలోని రైతు వేదిక లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై. స్థానిక సమస్యలపై. వివిధ శాఖల పనితీరుపై. నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై .వారు ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు.యస్ఐ గోపికృష్ణ మాట్లాడుతూ.. మండలంలో యువత మత్తు పానీయాలు.డ్రగ్స్ కు దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దొంగలు చోరీలు ఎక్కువగా చేస్తున్నందున అన్ని గ్రామాలలో ప్రధాన కూడలిలో సిసి కెమెరాలు ఏర్పాటుకు దాతలు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. మండల విద్యాధికారి నకిరేకంటి రవి మాట్లాడుతూ... ప్రాథమికో న్నత పాఠశాలల విద్యార్థులు మద్యం స్వీకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సర్పంచులు... జమానాయక్. ముత్తినేని శ్రీనివాస్. ఒగ్గు రవి మాట్లాడుతూ... సంబంధించిన వివిధ శాఖల అధికారులు గ్రామాల అభివృద్ధికి తమతో సహకరించి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. పాత్రికేయులు తమ గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించి. పత్రికల ద్వారా తమ గ్రామాల సమస్యలు పరిష్కరించే విధంగా సహకరించాలని వారు కోరారు. చర్చలలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు... విద్యుత్ ఏఈ శ్రీనివాస్ . పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ రాజేష్.. ఎంపీవో రాజేశ్వర్. ఏపీవో రవి. నీటిపారుదల అధికారి లింగయ్య. అంగన్వాడి సూపర్ వైజర్ లు హనీపా. స్వప్న .ఈసీ మహేష్ . ఏ వో అనిల్ కుమార్. ఏపీఎం అంజయ్య. వివిధ శాఖల అధికారులు. వివిధ గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బాలికలకు వ్యాక్సిన్



**అర్వపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అర్వపల్లి ఆధ్వర్యంలో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హ్యూమన్ పా పీలోమా, వైరస్ వ్యాక్సిన్ వేస్తున్నామని మండల వైద్యాధికారి భూక్య నగేష్ నాయక్ అన్నారు. గురువారం స్థానిక కేజీవిబి, అర్వపల్లి హైస్కూల్ విద్యార్థినీలకు టీకాలు వేసినట్లు తెలిపారు. అమ్మాయిలకు భవిష్యత్తులో గర్భ సంబంధిత క్యాన్సర్ రాకుండా ఉండేందుకు చాలా విలువైన ఈ వ్యాక్సిన్ ప్రభుత్వం, ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు.అమ్మాయిలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, హెల్త్ సూపర్వైజర్ లలిత, నర్సింగ్ ఆఫీసర్, బోడ సునీత, శ్యామల, ఏ ఎన్ ఏం జ్యోతి, అనూష, నీరజ, శైలజ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి




**సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 16, మన సాక్షి:**

ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. 99 రోజులపాటు ప్రణాళికలో భాగంగా ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక రోజుల మండల స్థాయి సమావేశం గురువారంసూర్యాపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్డీవో వేణు మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేయడంలో అభివృద్ధి పనుల విషయంలో వేగవంతం చేయాలనిసమస్యల తక్షణ పరిష్కారం చేయడంలో అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని అన్నారు.బడుగు బలహీన వర్గాల ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం ఉచిత కరెంటు,ఉచిత బస్సు రైతు బీమా , ఇందిరమ్మ ఇల్లులు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని మహిళలు ఇందిరాగాంధీని పూర్తిగా తీసుకొని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచులే కీలకమని అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించుటకు ఇదొక సదా అవకాశమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎస్సీ వెల్ఫేర్ డిడి లత, తాసిల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీ ఓ లింగారెడ్డి, సూపరిండెంట్ లక్ష్మి, మండల స్థాయి అధికారులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.ద

# రోడ్డు ప్రమాదాల నివారణకై అవగాహన

**గొదవరిఖని, ఏప్రిల్ 16,మన సాక్షి:**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా గురువారం గోదావరిఖని అడ్డగుంట పల్లి ప్రాంతంలోని కెమిస్ట్ భవన్‌లో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి గోదావరిఖని ఎస్ పి ఎం రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఏసీపీ మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులను ఆసుపత్రికి తరలిస్తే పోలీస్ కేసుల్లో చిక్కుకుంటామనే అపోహలు ప్రజల్లో ఉన్నాయని, అలాంటి భయాలు అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి రహ వీర్ పథకం క్రింద రూ.25 వేల ప్రోత్సాహకం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంట గోల్డెన్ అవర్‌గా ఉండి, ఈ సమయంలో సరైన వైద్యం అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.డీసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సమయంలో "గోల్డెన్ అవర్" ఎంతో కీలకమని, ప్రమాదం జరిగిన మొదటి గంటలో సరైన వైద్య సహాయం అందిస్తే ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి , గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వంటలు ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ సిఐ రాజేశ్వర్ ఎస్సై రమేష్, ఐఎంఏ అధ్యక్షుడు డా. క్యాదా శ్రీనివాస్,మెడికల్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు సుమారు 200 మంది మెడికల్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు, ఐఎంఏ హాస్పిటల్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కేతేపల్లిలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం

**కేతేపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**



కేతేపల్లి మండల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తయారు చేసుకునే విధానం, స్థానిక ఆహార పదార్థాలు, చిరుధాన్యాలను ఉపయోగించి వివిధ రకాల వంటకాలు తయారు చేయడం, తదితర విషయాలపై ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మకరకల్ మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల కేతేపల్లి సర్పంచ్ వీరం జాన్ రెడ్డి లు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వారికి బాల్యవివాహాలపై అవగాహన, సైబర్ క్రైమ్ నేరాలపైన బాలికలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు చూడాలని అన్నారు. ఏతేపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తాసిల్దార్ యు రమాదేవి, ఎంపీడీవో జి నాగలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ అర్చన, ఎంఈఓ భిక్షమయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ కళావతి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు, అంగన్వాడి టీచర్స్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 19న ఉమ్మడి జిల్లా బాలబాలికల చెస్ సెలక్షన్స్

**సూర్యాపేట,ఏప్రిల్ 16,మన సాక్షి:**

ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ సెలెక్షన్స్ -2026 అండర్ 7,11,19. బాల, బాలికలకు చెస్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, గండూరి కృపాకర్, ఎల్ సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 19 వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ సెలెక్షన్స్ బాల, బాలికలకు స్థానిక (టి. టి. డి )కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారిని హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు పంపించబడతారని మరియు షీల్డ్స్, ప్రశంసా పత్రాలు అందిఇస్తామని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లా చదరంగం క్రీడాకారులు ఉపయోగించుకోవాలని వారు కోరారు. వివరాలకు ఎల్ సతీష్ కుమార్ కార్యదర్శి, చరవాణి నెం. 9394753343 సంప్రదించాలని తెలిపారు.

## ఎమ్మెల్యే సహకారంతో నూతన పంచాయతీ భవనం మంజూరు

**వెల్దండ,ఏప్రిల్ 16,మన సాక్షి:**

మండల పరిధిలోని అల్లంతోట బావితండ గ్రామంలోని పాత పాఠశాల భవనంలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకర స్థితిలో ఉండుట వలన, అదే స్థలంలో కొత్త గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధులు మంజూరు చేశారని సర్పంచ్ రోజా అరుణ్ నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా ఉత్తర్వులు జారీ చేసిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కొత్త భవనం నిర్మాణం ద్వారా గ్రామ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగి, ప్రజలకు మెరుగైన సేవలు అందించుటకు ఎంతో దోహదపడుతుందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సహకారం, మద్దతుకు మేము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని చెప్పారు.ఈ సందర్భంగా మాకు అందించిన, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనీల సంజీవ్ కుమార్ యాదవ్ ,ఆర్ అండ్ బి అధికారులకు, ఎంపీడీవో కు గ్రామ సర్పంచ్,ఉపసర్పంచ్, సహకరించిన ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

# తెట్టు వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు చూద్దాం రండి..!

## - నేడు స్వామివారి కళ్యాణోత్సవ వైభవం

**మదనపల్లి, ఏప్రిల్ 16,మన సాక్షి:**

మదనపల్లి దగ్గర కురబలకోట మండలంలోని తెట్టు గ్రామంలో వెలసిన పురాతన వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య వేడుకగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి జరగనున్న స్వామివారి కళ్యాణోత్సవం భక్తులకు కనుల పండుగగా మారనుంది. అదే రాత్రి జరిగే గరుడోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. గరుడవాహనంపై స్వామివారు దర్శనమివ్వగా వేలాది మంది భక్తులు పాల్గొని తరిస్తారు.శనివారం నిర్వహించనున్న తేరు (రథోత్సవం) సందర్భంగా గ్రామం మొత్తం భక్తి వాతావరణంలో మునిగిపోతుంది. గ్రామ వీధులలో స్వామివారి రథం ఊరేగింపుగా సాగుతుండగా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకుంటారు.తెట్టు గ్రామంలోని ఈ ఆలయం పురాతనమైనదిగా పేరుగాంచింది. ఇక్కడ వెలసిన స్వామిని సంతాన వేణుగోపాలుడుగా భక్తులు విశ్వసిస్తారు. సంతానం లేని దంపతులు స్వామివారిని మొక్కుకుంటే సంతానం కలుగుతుందనే నమ్మకంతో ప్రతి సంవత్సరం మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి వరపడుతుంటారు.స్వామివారి కళ్యాణోత్సవంలో కర్నాటక రాష్ట్రంలోని కోడిపల్లి కుటుంబీకులు కన్యాదాతలుగా



వ్యవహరించడం మరో విశేషంగా నిలుస్తోంది.

వైసిపి హయాంలో ఆలయ అభివృద్ధి వైభవంగా సాగింది. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సహకారంతో అప్పటి ఆలయ కమిటీ చైర్మన్ కొరివి జగన్నాథరెడ్డి అభివృద్ధిలో ఆలయాన్ని ఓ స్థాయికి తీసుకెళ్లారు. గుడి ముందు బృందావనం పార్కు ఏర్పాటుతో పాటు కోనేరు బాగు చేయించారు. ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. ఎమ్మెల్యే మంజూరు చేయించిన రూ. 90 లక్షలతో రాజగోపురం, వాహనశాల, కాంపౌండ్ వాల్ మరమ్మతులు, ఫ్లోరింగ్ లాంటి పనులు జరుగుతున్నాయి.

వివిధ వేడుకలు కార్యక్రమాలు వైభవంగా సాగాయి. ఆలయ అభివృద్ధికి నిస్వార్థ సేవలు అందించారు. ఇతని హయాంలో ఓ రేంజ్ లో ఆలయ అభివృద్ధి సాగింది. రథోత్సవం సందర్భంగా మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకులు స్థానిక జడ్పీ హైస్కూల్ లోను, తెట్టు గ్రామ మాజీ సర్పంచ్ కామకోటి ప్రసాదరావు ఆధ్వర్యంలో అతని ఇంటి వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులకు ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికత కలిసిన ఈ బ్రహ్మోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతున్నాయి.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**ఆమనగల్లు,ఏప్రిల్ 16,మన సాక్షి:**



రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ వ్యాప్తంగా రవాణా శాఖ పోలీస్ శాఖ సంయుక్తంగా నిర్వహించనున్న స్థానిక ఎస్హెచ్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు.గురువారం పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ అలైవ్-అరైవ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని కారు నడిపే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని పలు ఉదాహరణలతో వివరించారు. అతివేగం ప్రమాదకరమని మద్యం సేవించే ఏ వాహనాన్ని నడపరాదన్నారు. వాహనదారులు చేసే అశ్రద్ధతో ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి తెచ్చుకో వద్దన్నారు.ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.సమావేశం అనంతరం ఆయా శాఖల అధికారులు డ్రైవర్లు వాహనదారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యమన అధికారి సురేష్, ఎంపీడీవో కుసుమ మాధురి, తహసిల్దార్ ఫహీం ఖాద్రి, సీఐ వెంకటేశ్వర్లు,మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎంఈఓ పాండు నాయక్, సీడీపీఓ శాంతి రేఖ, ఇరిగేషన్ ఏఈ తిరు సత్తయ్య, మిషన్ భగీరథ వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ గౌడ్, శోభారాణి, మండల సూపర్డెంట్ సుమలత, హౌసింగ్ ఏఈ శాలిని, ఎంపీఓ లక్ష్మణ్, డాక్టర్ మైమున బేగం, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, ఆయాగ్రామాల సర్పంచులు మండ్లి రాములు, శానమని సత్యం, శ్రీను నాయక్, యాదయ్య, వెంకటయ్య, మౌనిక, ప్రశాంతి,శ్రీలత,ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

# నగరపాలక వాహనాలతోనే పూడికతీత పనులు

**గోదావరిఖని ఏప్రిల్ 16,మన సాక్షి:**



నగర పాలక సంస్థ స్వంత వాహనాలు,మున్సిపల్ పాసిద్ధ సిబ్బందితోనే ప్రధాన కాలువల్లో స్పెషల్ రైస్ చేపట్టి పూడిక తొలగించే పడుతున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. కాలువల్లో పూడిక తీయిస్తూ కాంట్రాక్ట్ పేర కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం కాకుండా మిగులుస్తున్నామని అన్నారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా 40 వ డివిజన్ లో స్థానిక కార్పోరేటర్ కజంపురం జయప్రద రాజేందర్ తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పూడిక తీత పనులకు లక్షల రూపాయల నిధులు కేటాయిస్తూ పనులు మాత్రం తూతూ మంత్రంగా చేపట్టడం ఆనవాయితీ గా వస్తున్నదని అన్నారు. ఈ ఆనవాయితీ కి చరమ గీతం పాడుతూ డబ్బులు వృధా చేయకుండా నగర పాలక సంస్థ స్వంత వాహనాలు , మునిసిపల్ పారిశుద్ధ్య సిబ్బందితోనే ప్రదాన కాలువల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి పూడిక తొలగించే పనులు చేపడుతున్నామని అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా తాను , స్థానిక కార్పోరేటర్ తో పాటు పాలక వర్గ సభ్యులు , అధికార యంత్రాంగం , సిబ్బంది స్పెషల్ డ్రైవ్ లో పాల్గొంటూ పర్యవేక్షిస్తూ పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యేలా చూస్తున్నామని అన్నారు. ఉల్లి గడ్డల బజార్ లో ప్రవహిస్తున్న డ్రెయిన్ ఆక్రమణకు గురై భవనాలు నిర్మించడంతో పూడిక తీసే పనులకు ఆటంకం కలుగుతున్నదని అన్నారు. పూడిక తీయించని పక్షంలో రాబోయే వర్షాకాలంలో కాలువ నిండి మురుగు నీరు ఇళ్ళల్లోకి వచ్చే అవకాశం ఉందని అన్నారు.ఈ కార్యక్రమం లో రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఇ ఇ. పి వి రామన్ , టి పి ఎస్ నవీన్ , డి . ఇ అఫ్తాబ్ , ఎఇ , జమీల్ , సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం విజయవంతం చేయండి

**గోదావరిఖని,ఏప్రిల్ 16,మన సాక్షి:**




వన మహోత్సవం విజయవంతం చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.మొక్కలు నాటి సంరక్షించడం పై అటవీ శాఖాధికారుల సమన్వయంతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం వార్డు అధికారులకు నిర్వహించిన శిక్షణా సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభంలోనే సుమారు 1,80,000 మొక్కలు నాటేలా డివిజన్ వారీ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. మొక్కలు నాటడానికి అనువైన స్థలాల గుర్తింపు తో పాటు ఏఏ జాతి మొక్కలు ఎన్నెన్ని నాటాలో సవివరంగా ప్రణాళికలో పొందుపర్చాలని అన్నారు. ఎవెన్యూ , బ్లాక్ , హోమ్ స్టెడ్ ప్లాంటేషన్ కు సరిపడా ప్రణాళిక ప్రకారం ఆయా జాతుల మొక్కలు , ఎరువు , ట్రీ గార్డులు ముందే తెప్పించి సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్ కు సంబంధించి రోడ్డు వెడల్పు , విద్యుత్ తీగలు , పైప్ లైన్లు అన్నీ పరగణలోకి తీసుకొని అనువైన మొక్కలు నాటాలని అన్నారు. కాగా జన గణన , ఇందిరమ్మ ఇండ్లు ,పన్ను వసూళ్ల పురోగతి , పారిశుద్ధ్య నిర్వహణ పై కూడా ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఇ ఇ . పి వి రామన్ , డి . ఇ. షాభాజ్ , ఎ. ఇ . తేజస్విని అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ రహమతుల్లా, డి ఆర్ ఓ కొమురయ్య , బీట్ ఆఫీసర్ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో వివరాలు నమోదు చేసిన చంద్రబాబు



## పజలు అంతా జనగణనలో పాల్గొనాలని పిలుపు

అమరావతి:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వీయ జనగణనలో తన వివరాలను నమోదు చేసుకున్నారు. జనగణన ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా ఆన్ లైన్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. వెబ్ సైట్ ద్వారా ముఖ్యమంత్రి వివరాలను నమోదు చేసుకున్నారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని ముఖ్యమంత్రికి తెలిపారు. మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. దీని కోసం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించటం అవసరమని, ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఏపీలో జనగణన కార్యక్రమం జరుగుతోందని, ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరగనుందని, మొదటి దశలో ఇవాల్టి నుంచే ఇండ్ల గణన ప్రారంభమైందని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన హౌస్ లిస్టింగ్-హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. సరైన వివరాలను నమోదు చేయటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరారు. జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# విపక్షాల ఐక్యతకు పరీక్షా కాలం

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల నేపథ్యంలో విపక్ష కూటమిలో విభేదాలు బయటపడుతున్నట్టు తెలుస్తోంది. అలాగే వారి మధ్య ఐక్యత లేదని స్పష్టం అవుతోంది. బిల్లును వ్యతిరేకిస్తే తమకు పుట్టగతులు ఉండవన్న భయం కూడా వారిని వెన్నాడుతోంది. పార్లమెంట్‌లో ఈ కీలక బిల్లులపై ఓటింగ్‌కు ముందు జరిగిన సమావేశంలో వివిధ పార్టీలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడమే దీనికి కారణం. కేంద్రం తీసుకొస్తున్న ఈ బిల్లుల ద్వారా లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు రిజర్వేషన్ అమలును వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే.. ఈ ప్రక్రియను డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడంపై విపక్ష నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అందరూ పార్లమెంట్‌కు హాజరుకావడం కష్టమవుతోందని ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు సాగరికా ఘోష్ తెలిపారు. అయితే.. టీఎంసీ వైఖరిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. విపక్ష ఎంపీలు ఓటింగ్‌కు హాజరు కాకపోతే అది ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్లే అవుతుందని హెచ్చరించినట్టు సమాచారం.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన

- పనులను ఎస్ఎమ్‌సీలకు అప్పగించాలి
- స్కూళ్లలో ప్రవేశాల పెంపునకు డోర్ టు డోర్ క్యాంపెయిన్
- మంత్రి నారా లోకేశ్ ఆదేశాలు



అమరావతి: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను ఎస్ఎమ్‌సీలకు అప్పగించాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను 3 స్టార్‌కు చేర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపుదలకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో అత్యుత్తమ మార్కులపై ప్రచారం కల్పించాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని నివాసంలో గురువారం సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యా బోధనకు ముఖ ఆధారిత హాజరు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఉన్నత విద్యా సంస్థల్లో మరింత పారదర్శకత కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విషయంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్యా సంస్థల వివరాలతో పాటు సిబ్బంది, విద్యార్థుల ముఖ ఆధారిత గుర్తింపు కోసం ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై మంత్రి ఆరా తీశారు.

# చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా ?

అంబేడ్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే..పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిడిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేడ్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగంలో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్దాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మండి మాద్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొందరెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది. ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయరయ్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు,విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్ధతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ద ఉంటే ఈ రకమైన చట్టసవరణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి. కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ ప్రక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరుగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఏ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.